

6న జిల్లా సమీక్ష కమిటీ సమావేశం

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమీక్షా కమిటీ సమావేశం (డీఆర్‌సీ) ఈ నెల ఆరో తేదీ ఉదయం పది గంటలకు ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అధ్యక్షతన కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పార్లమెంట్ సభ్యులు, శాసనసభ, శాసనమండలి సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరవుతారన్నారు. జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఒక ప్రకటనలో కలెక్టర్ సూచించారు.



ఈస్ట్ కోస్ట్ మారీటైమ్ అండ్ లాజిస్టిక్స్ సమ్మిట్‌లో ఎయిర్ కార్గో ఫోరం ఆఫ్ ఇండియాకు చెందిన ఏపీ చాప్టర్‌ను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

ప్రతి 6 నెలలకు మారీటైమ్ సదస్సు

అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచన


విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి):

లాజిస్టిక్స్ రంగాన్ని అభివృద్ధి చేయడానికి విశాఖపట్నంలో ఆరు నెలలకొకసారి మారీటైమ్ సదస్సు ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులకు సూచించారు. నోవాటెల్ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన ఈస్ట్ కోస్ట్ మారీటైమ్ అండ్ లాజిస్టిక్స్ సమ్మిట్‌లో ఆయన ఈ సూచన చేశారు. లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటుకు అవసరమైన సూచనలు ఇవ్వాలని ఇక్కడి పారిశ్రామికవేత్తలను కోరారు. గ్లోబల్ లాజిస్టిక్స్ వ్యయం 8 శాతం ఉండగా, భారత

డేటా సెంటర్‌గా అభివృద్ధి చెందనున్న విశాఖ

నగరంలో సివిల్ ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటు

దేశంలో ఇది 13 శాతంగా ఉందని, ఈ వ్యయం బాగా దిగిరావడానికి అంతా కృషి చేయాలన్నారు. విశాఖలో జీఎంఆర్ సంస్థ సివిల్ ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తుందన్నారు. విశాఖపట్నం డేటా సెంటర్‌గా నంబర్‌వన్ స్థానంలో ఉంటుందని, ముంబై, బెంగళూరు నగరాలను తలదన్నే డేటా సెంటర్లు వస్తాయన్నారు. సింగపూర్ ... మిగతా 6వ పేజీలో



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు స్వాగతం పలుకుతున్న స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

'స్మార్ట్ సిటీ'పై ఇన్‌చార్జి మంత్రి ఆరా

- ఆ ప్రాజెక్టులను జీవీఎంసీకి అప్పగించాలంటూ కౌన్సిల్‌లో తీర్మానం చేసినట్టు చెప్పిన మేయర్
- అయినప్పటికీ టెండర్లు పిలవడంతో నోటీస్ ఇచ్చినట్టు వెల్లడి

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టులపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీవీరాంజనేయస్వామి ఆరా తీసినట్టు తెలిసింది. స్మార్ట్ సిటీ గడువు ముగిసినా జీవీఎంసీలో ఆ ప్రాజెక్టులు కొనసాగుతుండడం, దానిని రద్దు చేసి పెండింగ్ ప్రాజెక్టులను జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించాలని మేయర్ ఆదేశించినా పట్టించుకోకపోవడంపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి... మేయర్ పీలా శ్రీనివాసరావుతో చర్చించినట్టు సమాచారం. స్మార్ట్ సిటీని రద్దు చేస్తూ కౌన్సిల్‌లో తీర్మానం చేయడం, స్మార్ట్ సిటీ ఆస్తులు, ప్రాజెక్టులను జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగానికి అప్పగించాలని తాను ఆదేశించడం వాస్తవమేనని మేయర్ చెప్పినట్టు తెలిసింది. అయినప్పటికీ తనకు తెలియకుండా గాజువాకలో రూ.30 కోట్లతో స్మార్ట్ సిటీ ప్రాజెక్టుగా వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ... మిగతా 6వ పేజీలో

గీత కార్మికుల బార్‌లు కొట్టేసిన సిండికేట్లు?

మామూలు బార్‌కైతే లైసెన్స్ ఫీజు ఏడాదికి రూ.75 లక్షలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో బార్‌ల కేటాయింపులో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న నూతన బార్ పాలసీ వ్యాపారులకు గిట్టుబాటుగా లేకపోవడంతో పెద్దగా స్పందన రాలేదు. కానీ గీత కార్మికులకు కేటాయించిన బార్‌లకు సగం లైసెన్స్ ఫీజును రాయితీగా ప్రకటించడంతో వాటికి పోటీ ఏర్పడింది. కొంత మంది మద్యం వ్యాపారులే సిండికేట్‌గా ఏర్పడి గీత కార్మికులతో దరఖాస్తులు చేయించారనే ప్రచారం జరుగుతోంది. అందుకు సహకరించినందుకు ఎక్సైజ్ శాఖ అధికారులకు ఒక్కో బార్‌కు రూ.లక్షల్లోనే ముట్టినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అదే గీత కార్మికుల బార్‌కైతే రూ.32.5 లక్షలే


- అందుకే వాటిపై కన్నేసిన కొంతమంది మద్యం వ్యాపారులు
- పది బార్‌లకు నాలుగేసి దరఖాస్తులు దాఖలు
- ఎక్సైజ్ శాఖ అధికారులు సహకరించారనే ఆరోపణలు

జిల్లాలో 121 బార్‌లకు రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో నోటిఫికేషన్ జారీచేసింది. బార్‌కు ఏడాదికి లైసెన్స్ ఫీజు రూ.75 లక్షలుగా నిర్ణయించింది. దరఖాస్తు ఫీజు కింద మరో రూ.5.1 లక్షలు చెల్లించాలి. ఒక్కో బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ నిర్వహిస్తామని షరతు విధించింది. ప్రస్తుతం ప్రైవేటు మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూమ్‌లకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో సాధారణ, మధ్య తరగతికి చెందినవారు బార్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండాపోయింది. మద్యం దుకాణం వద్ద పర్మిట్‌రూమ్‌లో కూర్చొని మద్యం సేవించే వెసులుబాటు ఉండడంతో బార్‌కు వెళ్లి అధిక ధర చెల్లించాల్సిన అవసరం ఏమిటని మందుబాబులు భావిస్తున్నారు. కేవలం సంపన్న వర్గాలకు చెందినవారు మాత్రమే బార్‌కు వెళ్లే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో వ్యాపారం తగ్గిపోవడంతోపాటు నిర్వహణ ఖర్చులు భారీగా ఉంటాయనే భావనతో వ్యాపారులు బార్‌ల వైపు ఆసక్తిచూపడం లేదు. ఈ నేపథ్యంలో జిల్లాలో 121 బార్‌లకు నోటిఫికేషన్ విడుదల చేస్తే 45 బార్‌లకు దరఖాస్తులు రాకపోవడంతో వాటి కేటాయింపులు నిలిచిపోయాయి.

ఇదిలావుండగా గీత కార్మికుల కోటా కింద జిల్లాకు పది బార్‌లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. గీతకార్మికుల కోటాలోని బార్‌లకు కేవలం రూ.32.5 లక్షలు మాత్రమే లైసెన్స్ ఫీజుగా నిర్ణయించింది. అంటే ఏడాదికి రూ.32.5 లక్షలు చొప్పున మూడేళ్ల కాలపరిమితికి సుమారు రూ.కోటి వరకు లైసెన్స్ ఫీజు మిగులుతుంది. దీంతో మద్యం వ్యాపారంలో ఆరితేరిన కొందరు గీత కార్మికుల కోటాలోని బార్‌లను దక్కించుకోవడంపై దృష్టిసారించారు. వారంతా సిండికేట్‌గా ఏర్పడి వారికి తెలిసిన గీత కార్మికుల పేర్లతోనే దరఖాస్తు చేయించారు. ఒక్కోబార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ తీయాలనే నిబంధన ఉండడంతో ఒక్కో బార్‌కు నాలుగు మాత్రమే వచ్చేలా చక్రం తిప్పారు. దీనికి సహకరించాలని ఎక్సైజ్ శాఖ అధికారులను కోరగా, వారు కూడా సరేననడంతో గీత కార్మికుల బార్‌లన్నీ సిండికేట్‌ల చేతికే చిక్కాయి. దీని కోసం ఎక్సైజ్ శాఖ అధికారులు ఒక్కో బార్‌కు ఇంత అని చెప్పి తొమ్మిది బార్‌లకు భారీ మొత్తం వసూలు ... మిగతా 6వ పేజీలో

చంద్ర గ్రహణం సందర్భంగా
అప్పన్న దర్శన వేళల మార్పు

సింహాచలం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి):



సంపూర్ణ చంద్ర గ్రహణం సందర్భంగా ఈ నెల 7, 8 తేదీల్లో సింహాచలం వరాహలక్ష్మీ నృసింహస్వామి దర్శన వేళల్లో స్వల్పమార్పులు చోటుచేసుకుంటాయని ఈఓ వేంద్ర త్రినాధరావు తెలిపారు. ఈనెల 7న ఆదివారం రాత్రి 9.56 గంటలకు చంద్ర గ్రహణం ప్రారంభమై 1.24 గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఈ నేపథ్యంలో 7న ఉదయం 6.30 నుంచి 11.30 గంటల వరకూ మాత్రమే భక్తులకు స్వామివారి దర్శనం లభిస్తుందన్నారు. తిరిగి 8వ తేదీ సోమవారం ఉదయం ప్రభాత ఆరాధనలు, గ్రహణానంతర సంప్రోక్షణలు చేసి, ఉదయం 8 గంటల నుంచి దర్శనాలకు అనుమతి ఇస్తామన్నారు. గ్రహణం కారణంగా 7, 8 తేదీల్లో సుప్రభాతం, ఆరాధన, ఇతర ఆర్జిత సేవలను రద్దుచేశామని, 7న మధ్యాహ్నం ఒంటి గంట వరకూ మాత్ర మే నిత్యాన్న ప్రసాద వితరణ ఉంటుందన్నారు.

ఏయూ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ రాంబాబు బాధ్యతల స్వీకారం



పదవీ బాధ్యతలు చేపడుతున్న రిజిస్ట్రార్

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ కె.రాంబాబు మంగళవారం ఉదయం బాధ్యతలను స్వీకరించారు. ఆయనకు వైస్ చాన్సలర్ జీపీ రాజశేఖర్, రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.కిశోర్‌బాబు, పూర్వ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇఎన్ ధనుంజయరావు, పలువురు ప్రిన్సిపాల్స్, డీన్లు, ప్రొఫెసర్లు, ఇతర అధికారులు, ఏయూ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ప్రొఫెసర్ రాంబాబు విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్ల జారీకి సంబంధించిన ఫైల్‌పై తొలి సంతకం చేశారు. వర్సిటీ అభివృద్ధికి తన శాయక్తులా కృషిచేస్తానన్నారు.

చెదలుపడుతున్న ఫుడ్ లేబొరేటరీ!

ఏడాదిన్నర కిందట ల్యాబ్‌ను ప్రారంభించిన ప్రధాని నరేంద్రమోదీ

- ఇంకా సేవలు ప్రారంభించని అధికారులు
- నిరుపయోగంగా సుమారు రూ.15 కోట్ల విలువైన పరికరాలు
- ఇప్పటికీ ఆహార పదార్థాల నమూనాలను
- పరీక్షల నిమిత్తం హైదరాబాద్ పంపాల్సిన పరిస్థితి
- ఫలితాలు వచ్చేందుకు నాలుగైదు వారాలు పడుతోందంటున్న ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అధికారులు



పెదవాల్తేరులోని స్టేట్ ఫుడ్ లేబొరేటరీ భవనం

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి):

ఆహార భద్రత, ప్రమాణాలను మెరుగుపరిచే ఉద్దేశంతో పెదవాల్తేరులోని ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన స్టేట్ ఫుడ్ లేబొరేటరీ నిరుపయోగంగా ఉంది. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ ల్యాబ్‌ను ఏడాదిన్నర కిందట ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. అయితే, ఇప్పటివరకూ అందుబాటులోకి తీసుకురాలేదు. ఈ ల్యాబ్ నిర్మాణానికి సుమారు రూ.20 కోట్లు, పరికరాలు, పరీక్షల నిర్వహణకు అవసరమైన కెమికల్స్ కోసం మరో రూ.15 కోట్లు వెచ్చించారు. అయితే, అంత ఖర్చు చేసి సిద్ధం చేసిన ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకురావడంపై ఉన్నతాధికారులు దృష్టిసారించడం లేదు. దీంతో ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అధికారులు నిర్వహించే తనిఖీల్లో సేకరించే నమూనాలను పరీక్షించడం ఇబ్బందిగా మారుతోంది.

రాష్ట్ర విభజన జరిగి దశాబ్దం దాటినా ఇప్పటికీ ఆహార నమూనాలను పరీక్షల కోసం హైదరాబాద్‌లో ఉన్న స్టేట్ ఫుడ్ లేబొరేటరీకే పంపించాల్సి వస్తోంది. దీంతో ఫలితాల కోసం నాలుగు నుంచి ఐదు వారాలపాటు నిరీక్షించాల్సి వస్తోందని ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అధికారులు చెబుతున్నారు. కొద్దిరోజుల కిందట రాష్ట్ర స్థాయి అధికారులు ఆదేశాల మేరకు ... మిగతా 6వ పేజీలో

దేవదాయ శాఖలో ఇష్టారాజ్యం

విశాఖలో ఉంచడమే ప్రధాన ధ్యేయం

మెకానికల్ ఇంజనీర్‌కు ఎలక్ట్రికల్ ఏఈ పోస్టు

- ఉన్నతాధికారుల ఉత్తర్వులు... పట్టని ప్రజా ప్రతినిధులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

దేవదాయ శాఖలో అంతా పెద్దల ఇష్టారాజ్యమే నడుస్తోంది. అర్హతలు లేకున్నా పదోన్నతులు ఇచ్చేస్తారు. పని చేయాల్సిన విభాగం వదిలేసి దేవస్థానం అంతా తిరుగుతున్నా కళ్లు అప్పగించి చూస్తారు. తప్పనిసరిగా బదిలీ చేయాల్సి వస్తే... ఆ ఉద్యోగికి సరిపడా పని అక్కడ లేకపోయినా ఆర్డర్ ఇచ్చేస్తారు.



కనకమహాలక్ష్మి దేవస్థానం ఏఈ రామరాజు

సింహాచలం దేవస్థానం రవాణా విభాగం (బస్సులు)లో డీవీఎస్ రామరాజు (హరి) అనే ఉద్యోగి ఉన్నారు. ఎన్ఎంఆర్ స్థాయి నుంచి ఫిట్టర్‌గా, ఆ తరువాత ఏఈ (మెకానికల్)గా పదోన్నతి పొందారు. పేరుకు రవాణా విభాగమే కానీ ఆయన ఎప్పుడూ గ్యారేజ్‌లో కనిపించరు. ఆలయ ఈఓ కార్యాలయంలో లేదంటే వీఐపీల సేవలో తరిస్తుంటారు. దేవదాయ ఉద్యోగుల సంఘంలో కీలక స్థానంలో ఉండడంతో ఆడింది ఆటగా...పాడింది పాటగా సాగుతోంది. అయితే సుదీర్ఘకాలం ఒకే ఆలయంలో ఉండడంతో ఇటీవల జరిగిన బదిలీల్లో తప్పనిసరిగా బయటకు పంపాల్సి వచ్చింది. రవాణా విభాగం ఉద్యోగి కాబట్టి ఏ దేవస్థానానికి బస్సులు ఉన్నాయో చూసి అక్కడకు బదిలీ చేయాలి. అంటే అన్నవరం లేదా విజయవాడ పంపాలి. కానీ ఆయనకు విశాఖ వదిలి వెళ్లడం ఇష్టం లేదు. దాంతో విజయవాడ ఉన్నతాధికారులు ఇక్కడే వన్‌టౌన్‌లోని కనక మహాలక్ష్మి దేవస్థానానికి ఏఈగా బదిలీ చేశారు. ఈ దేవస్థానంలో ఎలక్ట్రికల్ ఏఈ పోస్టు మాత్రమే ఉంది. మెకానికల్ ... మిగతా 6వ పేజీలో

జేఎన్ఎన్‌యూఆర్ఎం బస్సుల ఆధునికీకరణకు రూ.కోటి



- కొటేషన్ ఇచ్చిన అశోక్ లేల్యాండ్ సాంకేతిక నిపుణులు
- ఆర్టీసీ ప్రధాన కార్యాలయానికి ప్రతిపాదనలు పంపిన ఆర్ఎం
- అనుమతి వచ్చిన వెంటనే ప్రారంభం కానున్న పనులు

ద్వారకా బస్‌స్టేషన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి):

ఆర్టీసీ విశాఖ రీజియన్‌లోని 17 జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యువల్ మిషన్ (జేఎన్ఎన్‌యూఆర్ఎం) బస్సుల ఆధునికీకరణకు సుమారు రూ.కోటి ఖర్చవుతుందని అశోక్ లేల్యాండ్ సాంకేతిక నిపుణులు అంచనా వేశారు. రీజియన్‌లో 18 బస్సులుండగా అందులో ఒకటి గత నెల 27న దగ్ధమైన విషయం తెలిసిందే. దాంతో ఆ బస్సులన్నింటినీ తాత్కాలికంగా నిలిపివేయాలని, సాంకేతికతను పరిశీలించి ఫిట్‌గా మార్చాలని ముఖ్యమంత్రి ... మిగతా 6వ పేజీలో

డబుల్ డెక్కర్ టికెట్ ధర
పెద్దలకు రూ.250, పిల్లలకు రూ.100



సాగర్‌నగర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి):

పర్యాటక శాఖ, జీవీఎంసీ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ సంయుక్తంగా బీచ్‌రోడ్డులో నడుపుతున్న డబుల్ డెక్కర్ బస్సులకు సంబంధించి టికెట్ ధర పెద్దలకు రూ.250, పిల్లలకు రూ.100గా నిర్ణయించారు. ఆర్కే బీచ్, వుడా ... మిగతా 6వ పేజీలో

భారీ వినాయక విగ్రహాల వద్ద
భక్తుల నిలువుదోపిడీ

- దర్శనానికి రూ.100
- ఫొటో దిగాలంటే రూ.60
- నిర్వాహకుల దందా...పట్టించుకోని పోలీసులు

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి):

ప్రజల విశ్వాసాన్ని కొందరు వినాయక ఉత్సవాల నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ ఏడాది గాజువాక లంకా మైదానంలో భారీ సుందర వస్త్ర గణపతి విగ్రహం, గాజువాక డిపో సమీపాన కోటి లింగాల గణపతి విగ్రహాలు ఏర్పాటయ్యాయి. భారీ గణపతి విగ్రహాలను దర్శించుకునేందుకు పెద్దఎత్తున భక్తులు తరలివస్తుండడంతో నిర్వాహకుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్టుగా సాగుతోంది. ఉత్సవ ప్రాంగణంలోకి అడుగుపెట్టిన వారికి కనీసం రెండు వందల రూపాయలు ఖర్చవుతోంది. పోలీస్ శాఖ హెచ్చరికలను ఉత్సవ నిర్వాహకులు ఎంత మాత్రం పట్టించుకోకుండా అడుగడుగునా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని భక్తులు గగ్గోలు పెడుతున్నారు. భక్తులకు



గాజువాక భారీ వినాయక విగ్రహం వద్ద భారీగా భక్తులు

ఉచిత దర్శనం కల్పించాలని, టికెట్లు రూపేణా వసూళ్లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు చేపడతామని నగర పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. దాంతో నిర్వాహకులు తెలివిగా ఎటువంటి బోర్డు పెట్టకుండా కొంతమంది కమిటీ సభ్యుల సహకారంతో ... మిగతా 6వ పేజీలో

కుక్కల సమస్యపై కలెక్టర్‌కు వినతి

భీమునిపట్నం (రూరల్), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మజ్జివలస గ్రామంలో వీధి కుక్కలు ఎక్కువైపోయాయని, సమస్యను పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ వార్డు సభ్యులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. మంగళవారం వారు కలెక్టరేట్‌లో కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో వీధి కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయని, కనిపించిన ప్రతిఒక్కరిపై దాడి చేస్తుండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారని చెప్పారు. తక్షణమే సమస్యను పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

మధురవాడలో 300 మంది రక్తదానం

కొమ్మాది, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకల సందర్భంగా మధురవాడలో రాయల్ బిజినెస్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. వందేభారత్, ఫస్ట్ బ్లడ్, విజయశ్రీ బ్లడ్ బ్యాంకుల సిబ్బంది 300 మంది దాతల నుంచి రక్తం సేకరించారు. రక్తదాతలకు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి డైరెక్టర్ పంచకర్ల సందీప్, ప్రశంసా పత్రాలు, పవన్‌కల్యాణ్ ఫొటోతో కూడిన జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో రాయల్ బిజినెస్ నెట్‌వర్క్ ఫౌండర్స్ కర్రి స్వామి, పి.నవీన్, ఉమామహేశ్, బంటుపల్లి సంతోష్ పాల్గొన్నారు.

వివేకానందనగర్‌లో కుంకుమ పూజలు

ఎండాడ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు వివేకానందనగర్‌లో పీపుల్స్ వెల్ఫేర్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గురువారం అన్నసమారాధన ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

జిమ్సర్‌లో పోషకాహార వారోత్సవాలు

ఎండాడ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) ఆసుపత్రి పోషకాహార విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నుంచి జాతీయ పోషకాహార వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వైద్యులు పోషకాహార ప్రాధాన్యతను వివరించారు. అనంతరం రోగులు, గీతం ఉద్యోగులకు పలు పోషకాహార పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోషకాహారంపై పోస్టర్ తయారీ పోటీలు నిర్వహించారు. ఈనెల 7వ తేదీ వరకు జరిగే వారోత్సవాల్లో భాగంగా పోషకాహార వంటల తయారీ పోటీలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గీతం పోషకాహార నిపుణులు పి.మానస లక్ష్మీ, ఎం. తేజస్వీని, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

పద్మనాభం రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి లీలా ప్రసాద్ సూచించారు.మంగళవారం ఆయన రేవిడి, వెంకటాపురం, కరుపల్లి గ్రామాల్లో సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో నీటి నిల్వల వల్ల దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంటుందన్నారు. ఈమేరకు ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి విజయనగరం జిల్లా భోగాపురం మండలం ముడసాలపేట గ్రామానికి చెందిన చెల్లిబోయిన నరసింగరావు దంపతులు రూ. 1 లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తాన్ని నగదు రూపంలో దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావుకు వారు మంగళవారం అందజేశారు.

డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ మెరిట్ జాబితా ప్రకారం రెండో విడత అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన మంగళవారం ఉక్కు నగరంలోని విశాఖ విమల విద్యాలయంలో నిర్వహించారు. మొత్తం 82 మంది అభ్యర్థులు హాజరుకాగా, వారి కోసం నాలుగు కౌంటర్లు ఏర్పాటుచేశారు. వెరిఫికేషన్ ప్రక్రియను విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయ్‌భాస్కర్, జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ పర్యవేక్షించారు. కాగా, కాల్ లెటర్‌లు అందుకున్న అభ్యర్థులు పలువురు వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నందున బుధవారం వచ్చేందుకు అవకాశం కల్పించారు.

అనంతవరంలో అన్నసమారాధన

పద్మనాభం రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంతవరం గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. వార్డు సభ్యుడు సిద్ధనాతి వెంకటరావు, రమణమ్మ దంపతులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొర్రెపాటి వెంకటలక్ష్మి, పెద ఎర్నినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ డెక్కర్ టికెట్ ధర

పెద్దలకు రూ.250, పిల్లలకు రూ.100

... 5వ పేజీ తరువాయి

పార్కు, రుషికొండ బీచ్‌ల వద్ద టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. రోజులో ఒకసారి (కాలపరిమితి 24 గంటలుగా నిర్ణయించారు) టికెట్ తీసుకుని ఆర్కే బీచ్ నుంచి తొట్లకొండ వరకూ ఎన్నిసార్లు అయినా ప్రయాణించవచ్చు. ఆర్కే బీచ్, సబ్‌మెరైన్, హెలికాప్టర్ మ్యూజియం, విశాఖ మ్యూజియం, వీఎంఆర్‌డీఏ పార్కు, కైలాసగిరి రోప్‌వే, తెన్నేటి పార్కు, ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కు, ఇస్కాన్ టెంపుల్, టీటీడీ టెంపుల్, రుషికొండ బీచ్, తొట్లకొండల వద్ద బస్సులు ఆగుతాయి.

భక్తుల నిలుపు దోపిడీ

... 5వ పేజీ తరువాయి

నేరుగా భక్తుల నుంచి వంద రూపాయలు తీసుకుని దర్శనానికి పంపుతున్నారు. అదేవిధంగా వినాయక విగ్రహాల వద్ద ఫొటో తీసుకునేందుకు అరవై రూపాయలు, శివలింగ రూపంలో ఉన్న లడ్డూను దర్శించుకునేందుకు ఇరవై రూపాయలు, ఇతరత్రా విగ్రహాల దర్శనం కోసం మరికొంత...వసూలు చేస్తున్నారు. ఈ పరిస్థితి గాజువాకలో ఏర్పాటుచేసిన రెండు భారీ విగ్రహాల వద్ద కొనసాగుతోంది. ఇప్పటికైనా పోలీస్ శాఖ కళ్లు తెరవాలని భక్తులు కోరుతున్నారు.



నీటితో కళకళలాడుతున్న తుమురుగెడ్డ జలాశయం



మూసివేసిన చెక్ పోస్టు

అభివృద్ధికి నోచుకోని తుమురుగెడ్డ

- ఏళ్ల తరబడి నిర్వహణ కరువు
- పాడైన రాతి కట్టు
- మూసుకుపోయిన తూములు
- చెక్ పోస్టు మూసివేతతో ఆకతాయిల ఆగడాలు

మధురవాడ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పీఎంపాలెం పరిధిలోని రత్నగిరి హౌసింగ్ బోర్డు కాలనీ దగ్గర ఉన్న తుమురుగెడ్డ జలాశయం ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోవడం లేదు. సుమారు 50 ఏళ్ల కిందట రైతుల సాగు నీటి అవసరాల నిమిత్తం ఈ జలాశయాన్ని నిర్మించారు. కాలక్రమంలో దీని కింద ఉన్న భూములన్నీ లేఅవుట్లు వేసి గృహ సముదాయాలుగా మార్చడంతో జలాశయం మరుగున పడింది. రెండు కొండల నడుమ సహజ సిద్ధంగా ఉన్న ఈ జలాశయాన్ని ఆధునికీకరించాలని శంభువానిపాలెం నివాసితులు గత 20



తాళం వేసి ఉన్న సెక్యూరిటీ గది

ఏళ్లుగా కోరుతున్నా.. పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఏడాది పొడవునా నీటితో కళకళలాడుతున్న ఈ జలాశయం కింద రాతి కట్టు పూర్తిగా పాడైపోవడంతో నీరు నిల్వ ఉండే సామర్థ్యం తగ్గిపోతోంది. అలాగే తూములు మూతపడిపోయాయి. జలాశయం వద్దకు వెళ్లే రహదారిలో అటవీ శాఖాధికారులు చెక్ పోస్ట్ ఏర్పాటు చేశారు. ఈ జలాశయం వద్ద చెత్త వేయడం, అటవీ జంతువులను భయపెట్టడం, జలాశయంలో ఈత కొట్టడం, చేపలు పట్టడం వంటి వాటిపై నిషేధం ఉంది. ఈమేరకు అధికారులు అక్కడ చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. కొన్నాళ్ల పాటు ఇది కొనసాగగా తరువాత మూసివేశారు. దీంతో కొందరు ఆకతాయిలు ప్రాజెక్టు వద్దకు వెళ్లి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు.చెక్‌పోస్టు ఉన్నపుడు స్థానికులు తప్ప ఇతరులు అటువైపు వెళ్లడానికి భయపడేవారు. చెక్‌పోస్టు మూతపడిన తరువాత కొందరు జలాశయంలో చేపలు కూడా పడుతున్నారు. కాగా ఈ జలాశయం వల్ల హౌసింగ్ బోర్డు కాలనీతో పాటు బక్కన్నపాలెం వరకు భూగర్భ జలాలు పుష్కలంగా లభిస్తున్నాయి. జలాశయాన్ని అభివృద్ధి చేస్తే సుమారు 50 వేల మంది ప్రజలకు నేరుగా తాగునీరు అందించవచ్చు. అలాగే జలాశయాన్ని అభివృద్ధి చేసి పర్యాటకంగా తీర్చిదిద్దితే గిరిజనులకు ఉపాధి లభిస్తుంది.కూటమి ప్రభుత్వం పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నందున ఈ జలాశయాన్ని కూడా అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఖాళీ స్థలంలో ప్రజా ఉపయోగకర భవన నిర్మాణాలు

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- మండల పరిషత్ కార్యాలయం సందర్శన

భీమునిపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఖాళీగా ఉన్న స్థలంలో ప్రజా ఉపయోగకర నిర్మాణాలు చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యాలయం మొత్తం స్థలం 3.75 ఎకరాల్లో ఉండగా, ఎకరంన్నరలో కార్యాలయం భవనం, సమావేశ మందిరం, బుద్ధుడి విగ్రహం ఉన్నాయని చెప్పారు. మిగిలిన రెండు ఎకరాల్లో శిథిలావస్థకు చేరిన క్వార్టర్స్ ఉండగా వాటిని ఇటీవల తొలగించామని తెలిపారు. ఖాళీగా ఉన్న రెండు ఎకరాల్లో ప్రజలకు ఉపయోగపడేలా, ఆదాయం లభించేలా షాపింగ్ కాంప్లెక్స్, ఆడిటోరియం, ఫంక్షన్ హాల్ తదితర నిర్మాణాలు చేపట్టనున్నట్టు చెప్పారు. ఈ విషయమై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు



ఖాళీ స్థలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

గాడు వెంకటప్పుడు, ఎంపీడీవో రమేష్‌నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు దంతులూరి అప్పలనరసింహరాజు, మజ్జివలస పీఏసీఎస్ అధ్యక్షుడు గుడ్డాల ఎల్లయ్య, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, నాయకులు సరగడ అప్పారావు, తాతినాయుడు, సిద్దార్థ వర్మ, బోని ప్రసాద్, సింగపూర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయిని శ్రీదేవికి సన్మానం



ఉపాధ్యాయిని శ్రీదేవిని సన్మానిస్తున్న ట్రస్టు సభ్యులు

భీమునిపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత,పట్టణంలోని జీవీఎంసీ పండిట్ నెహ్రూ హైస్కూల్ హెచ్ఎం మాదాబత్తుల తిరుమల శ్రీదేవిని సుందరమ్మ రామన్న చెట్టి వెల్ఫేర్ ట్రస్ట్ ఛైర్మన్ చెట్టి అశోక్ చక్రవర్తి, ట్రస్ట్ సభ్యులు చెట్టి సింహాచలం మంగళవారం ఘనంగా సత్కరించారు. పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత హెచ్ఎం చెట్టి సింహాచలం మాట్లాడుతూ విద్యా వ్యాప్తికి శ్రీదేవి చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇమంది వెంకటరావు, నయీమ్ అన్సారీ, కాళ్ల శ్రీనివాసరావు, రమాదేవి, చందు పాల్గొన్నారు. అలాగే భీమిలి ప్రెస్ క్లబ్ తరఫున కూడా శ్రీదేవిని ఘనంగా సన్మానించారు.

పాఠశాల క్రీడా మైదానం పరిశీలన



క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న రవితేజ

కొమ్మాది, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ తెలిపారు. వర్షం పడితే క్రీడా మైదానంలో నీరు నిలిచిపోయి బురదమయంగా మారుతుంది. ఇటీవల పాఠశాలను సందర్శించిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆట స్థలం పరిస్థితి చూసి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలోనే క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయాలని ఆదేశించినా...స్పందించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈమేరకు రవితేజ మైదానాన్ని పరిశీలించారు.

ఘనంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు

మధురవాడ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జనసేన నాయకులు, కార్యకర్తలు పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఆశయ సాధనకు కృషి చేయాలని రాష్ట్ర కాలుష్య నియంత్ర మండలి డైరెక్టర్ పంచకర్ల సందీప్ పిలుపునిచ్చారు. పవన్ కల్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా ఏడో వార్డు పిలకవానిపాలెంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జనసేన వార్డు అధ్యక్షుడు నాగోతి నరసింహనాయుడు, జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

భీమునిపట్నం (రూరల్) : నగరపాలెంలో పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్వీట్లు, పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఆ గ్రామ జనసేన అధ్యక్షుడు ఇదిపల్లి నానాజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పి. కొండబాబు, జిల్లా కమిటీ సభ్యులు సురేశ్, మండల ఉపాధ్యక్షుడు పల్ల రమణ, వెంకటేష్ ఉదయకుమార్, పోతురాజు పాల్గొన్నారు. అలాగే రెండవ వార్డు చిల్లపేటలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 53 మంది యువకులు రక్తదానం చేశారు. తలసేమియా పిల్లలు, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారి కోసం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు జనసేన నాయకులు తెలిపారు.

ఎండాడ : ఎండాడలో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో 8వ వార్డు అధ్యక్షుడు శాఖరీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర కాలుష్య నియంత్ర మండలి డైరెక్టర్ పంచకర్ల సందీప్ కేక్ కట్ చేశారు. అనంతరం రక్తదానం, ఉచిత వైద్య శిబిరాలను ప్రారంభించారు. అలానే గొల్లల ఎండాడ అంగన్వాడీ కేంద్రానికి కుర్చీలను వితరణగా అందజేశారు.



పిలకవానిపాలెం లో కేక్ కట్ చేస్తున్న పంచకర్ల సందీప్

ఆనందపురం : వేములవలసలోని పార్టీ కార్యాలయంలో పవన్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మండల పార్టీ, జై జవాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ శిబిరాన్ని ఆ పార్టీ భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ ప్రారంభించారు.

సింహాచలం : పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా 98వ వార్డు అధ్యక్షుడు మజ్జి సూరిబాబు సారథ్యంలో 500మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పవన్ అభిమానులు దాసరి మురళి, ద్వారపూడి శ్రీనివాసరావు, కిలారి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వసుధ ఫార్మా డైరెక్టర్ ఫోన్ కోసం పోలీసుల గాలింపు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ పరిధి ప్రగతి మైదానంలో ఆత్మహత్యకు పాల్పడిన వసుధ ఫార్మా డైరెక్టర్ మంతెన సూర్యనాగ వరప్రసాదరాజు ఫోన్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. సోమవారం ఆత్మహత్యకు పాల్పడిన ప్రసాదరాజు ఫోన్‌ను ఓ గుర్తు తెలియని వ్యక్తి లిఫ్ట్ చేసి అతను చనిపోయాడని చెప్పాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్న సమయంలో ఆ ఫోన్ లభ్యం కాలేదు. ఆ నంబర్‌కు కాల్ చేస్తే ఫోన్ స్విచ్చాఫ్ వస్తోందని పోలీసులు తెలిపారు.

హోంగార్డు ఉద్యోగాలకు నోటిఫికేషన్

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏడు హోంగార్డు ఉద్యోగాల భర్తీకి సీపీ శంఖబ్రతబాగ్చి నోటిఫికేషన్ జారీ చేశారు. కమిషనరేట్ పరిధికి చెందిన పురుష, మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని సీపీ పేర్కొన్నారు. అభ్యర్థులు 21 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు కలిగి, ఏదైనా గుర్తింపుపొందిన యూనివర్సిటీ నుంచి ఫోరెన్సిక్ సైన్స్‌లో డిప్లమో/డిగ్రీ/పీజీ చేసి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చేనెల మూడు, నాలుగు తేదీల్లో దరఖాస్తుల పరిశీలన, 12న 75 మార్కులకు గంటన్నర పాటు రాతపరీక్ష ఉంటుందని ఎంపికైన వారికి రోజుకు రూ.710 చొప్పున గౌరవ వేతనం అందజేస్తామన్నారు.

చెదలుపడుతున్న ఫుడ్ లేబొరేటరీ!

... 5వ పేజీ తరువాయి

విశాఖలో పెద్దఎత్తున హోటల్స్, రెస్టారెంట్‌లు, బేకరీల్లో తనిఖీలు నిర్వహించారు. అనేకచోట్ల కెమికల్స్ ఇతర రసాయనాలు వినియోగించినట్టు అనుమానం రావడంతో నమూనాలను సేకరించి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించారు. అయితే, ఆ ఫలితాలు ఇప్పటివరకూ రాకపోవడం ఆయా హోటళ్లపై చర్యలు తీసుకోవడానికి ప్రతిబంధకంగా మారిందని అధికారులు చెబుతున్నారు.

నిరుపయోగంగా పరికరాలు

కేంద్ర ప్రభుత్వం ఏపీతోపాటు మరికొన్ని రాష్ట్రాలకు ఈ ల్యాబ్‌లను మంజూరు చేసింది. ఏపీలో మూడు ల్యాబ్‌ల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఒక్కో ల్యాబ్ ఏర్పాటు, పరికరాలు కోసం సుమారు రూ.30 కోట్లు కేటాయించింది. అయితే, ఈ మూడుచోట్ల కూడా ల్యాబ్‌లు ప్రారంభమైనా సేవలు ఇంకా అందుబాటులోకి రాలేదు. ల్యాబ్‌లు నిరుపయోగంగా ఉండడానికి ఉన్నతాధికారుల నిర్లక్ష్యమే కారణంగా పేర్కొంటున్నారు. ఏడాది కిందట సుమారు రూ.15 కోట్ల విలువజేసే అత్యాధునిక పరికరాలు ల్యాబ్‌కు చేరాయి. ఈ పరికరాలను ఇప్పటివరకూ బయటకు తీయలేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆహార నాణ్యత, రసాయనాలు వినియోగం, పాయిజన్, ఆరోగ్యానికి హాని కలిగించే ఇతర పదార్థాలు వినియోగం, కలుషిత నీటి నిర్ధారణ వంటి పరీక్షల నిర్వహణకు అవసరమైన అత్యాధునిక హాట్ ఎయిర్ ఒవెన్, మఫుల్ ఫర్నేస్, వాటర్ బాత్, ఎల్‌సీ-ఎంఎస్, జీసీ-ఎంఎస్, ఐసీపీ ఎంఎస్, బాలెన్స్, ఆటో క్లేవ్, మైక్రో స్కోప్ వంటి 60 పరికరాలు ల్యాబ్‌లో నిరుపయోగంగా పడి ఉన్నాయి. అలాగే, సుమారు రూ.2 కోట్ల విలువైన కెమికల్స్ ఉన్నాయని, ఇవి రోజులు గడిచినకొద్దీ వినియోగించలేని స్థితికి చేరుకుంటాయని నిపుణులు చెబుతున్నారు. ఈ పరికరాల ద్వారా బిస్కెట్స్, పాలు, పాల ఉత్పత్తులు, ఆయిల్స్, సాఫ్ట్ డ్రింక్స్ వంటి 17 రకాల ఆహార పదార్థాలను పరీక్షించేందుకు అవకాశం ఉంది. ఈ ల్యాబ్ నిర్వహణకు అవసరమైన సుమారు 70 మంది సిబ్బందిని నియమిస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించింది. కానీ, ఇప్పటివరకూ ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. ల్యాబ్ అందుబాటులోకి రాకపోవడానికి అది కూడా ప్రధానమైన అడ్డంకిగా మారినట్టు చెబుతున్నారు.

ప్రతి 6 నెలలకు మారీటైమ్ సదస్సు



పారిశ్రామికవేత్తలకు నమస్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

... 5వ పేజీ తరువాయి

నుంచి సీ కేబుల్ వస్తుందని చెప్పారు. త్వరలో అమరావతికి బుల్లెట్ ట్రైన్ కూడా వస్తుందని చెప్పారు. స్టీల్ ఉత్పత్తుల రవాణా కోసం ప్రత్యేకంగా ఒక పోర్టు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. షిప్పింగ్ లైన్స్‌కు చెందిన త్రిపాఠి మాట్లాడుతూ, షిప్ రిపేర్లకు 200 నుంచి 300 ఎకరాలు కేటాయించాలని కోరగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

దేవదాయ శాఖలో ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

ఏఈ పోస్టు లేదు. కాబట్టి ఆ పోస్టింగ్ చెల్లదు. కానీ వడ్డించే వాడు మన వాడే కాబట్టి, పైగా సంఘం నాయకుడు కూడా కావడంతో కళ్లు మూసుకొని కనకమహాలక్ష్మి దేవస్థానం అధికారులు చేర్చేసుకున్నారు. ఆయనకు తెలిసింది మెకానికల్ పని. కనకమహాలక్ష్మి ఆలయంలో ఆ పనులు లేవు. దాంతో అయ్యవారు నచ్చినప్పుడల్లా సింహాచలం వెళ్లిపోతున్నారు. అక్కడ వీఐపీల సేవలో తరిస్తున్నారు. దీనిని అడిగే నాథుడే లేడు. ఆలయ ఈఓ వెనుక తిరుగుతూ సివిల్ ఇంజనీరింగ్ పనుల్లో తల దూరుస్తున్నా పట్టించుకోవడం లేదు. ప్రజా ప్రతినిధులు కూడా పైరవీకారులకే కొమ్ము కాస్తున్నారు. ఇలాంటి అడ్డగోలు ఉత్తర్వులు ఇస్తున్న ఉన్నతాధికారుల తీరుపై కూడా ప్రభుత్వం ఓ కన్ను వేయాల్సిన అవసరం ఉంది.

జేఎన్ఎన్‌యూఆర్‌ఎం బస్సుల ఆధునికీకరణకు రూ.కోటి

... 5వ పేజీ తరువాయి

ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఈ బస్సులను అశోక్ లేల్యాండ్ సంస్థ తయారుచేసింది. ఆర్టీసీ అధికారులు ఆ సంస్థ ఇంజనీరింగ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో నలుగురు సాంకేతిక నిపుణులు వచ్చి స్టీల్ డిపోలో ఉన్న 17 జేఎన్ఎన్‌యూఆర్‌ఎం బస్సులను సోమ, మంగళవారాల్లో పరిశీలించారు. ఇంజన్ల ఫిట్‌నెస్, ఎలక్ట్రికల్ వైరింగ్, బాడీ ఫిటింగ్, తదితర అంశాలపై సమీక్షించారు. పదేళ్లుగా నడుస్తుండడంతో ఆధునికీకరణ అవసరమని నిర్ధారించారు.పలు విడిభాగాలు, ఇంజన్ పూర్తి సర్వీసింగ్, బాడీ రీఫిట్టింగ్, ఎలక్ట్రికల్ వైరింగ్ చేపట్టాలని సూచించారు. ఇందుకోసం సుమారు రూ.కోటి ఖర్చవుతుందని కొటేషన్ ఇచ్చారు.దీనిని ఆర్ఎం అప్పలనాయు డు ఆర్టీసీ ప్రధాన కార్యాలయానికి పంపారు. అనుమతి వచ్చిన వెంటనే బస్సుల ఆధునికీకరణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

చిరస్మరణీయ నేత వైఎస్సార్

- వర్ధంతి సభల్లో వైసీపీ నాయకులు

భీమునిపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సభలు మంగళవారం జరిగాయి. భీమిలిలోని చేపలుప్పాడ వైసీపీ కార్యాలయంలో కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావు ఆధ్వర్యంలో నాయకులు వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. 3వ వార్డు వైసీపీ అధ్యక్షుడు అల్లిపిల్లి నరసింగరావు ఆధ్వర్యంలో తోటవీధిలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

సింహాచలం : సింహాచలం ప్రధాన కూడలిలో జరిగిన కార్యక్రమంలో వైసీపీ 98వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు ఆధ్వర్యంలో పలువురు రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్థానికులకు పులిహోర పంపిణీ చేశారు.

మధురవాడ : జీవీఎంసీ ఏడో వార్డులో వైసీపీ నాయకులు వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సభ నిర్వహించారు. అలాగే చంద్రంపాలెం బాపూజీ కళామందిరం వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పించారు.



సింహాచలంలో నివాళులు అర్పిస్తున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు

తగరపువలస : తగరపువలస కూడలిలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి వైసీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రెండో వార్డులోని జీరుపేట పార్టీ కార్యాలయంలో కూడా వర్ధంతి సభ జరిగింది.

ఆనందపురం : వేములవలసలోనూ వర్ధంతి సభ నిర్వహించారు. వైసీపీ నాయకులు వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కొమ్మాది : పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు వైఎస్ఆర్ అని వైసీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త చిన్న శ్రీను అన్నారు. పీఎంపాలెంలో ఆయన వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

గీత కార్మికుల బార్‌లు కొట్టేసిన సిండికేట్లు?

... 5వ పేజీ తరువాయి

చేసినట్టు మద్యం వ్యాపారంలో ఉన్నవారే ఆరోపిస్తున్నారు. గీత కార్మికుల కోటాలో బార్‌లు కేటాయించిన అధికారులు ఆయా లైసెన్స్ ఫీజు కింద చెల్లింపులు ఎవరి బ్యాంకు ఖాతాల నుంచి జరిగాయనేది పరిశీలిస్తే వాస్తవాలు బయటపడతాయని, దీనిపై ఏసీబీ, విజిలెన్స్ అధికారులు దృష్టిసారించాలని మద్యం వ్యాపారులు కొందరు డిమాండ్ చేస్తున్నారు. గీత కార్మికుల ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం లైసెన్స్ ఫీజులో సగం రాయితీ కల్పిస్తే దానిని సిండికేట్లు కొట్టేయడం దారుణమంటున్నారు. ఈ విషయం ఎక్సైజ్ శాఖలోని ఉన్నతాధికారుల వద్ద ప్రస్తావించగా, మద్యం వ్యాపారుల్లో వర్గ విభేదాల కారణంగానే ఇలాంటి ఆరోపణలు వస్తున్నాయన్నారు. వారి ఆధిపత్యం కోసం తమపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని కొట్టిపారేశారు.

'స్మార్ట్ సిటీ'పై ఇన్‌చార్జి మంత్రి ఆరా

... 5వ పేజీ తరువాయి

భవన నిర్మాణానికి టెండర్లు పిలవడంతో షాక్‌కు గురయ్యానని, దీనిపై స్మార్ట్ సిటీ అధికారులకు సోమవారం నోటీస్ జారీ చేశానని వివరించినట్టు తెలిసింది. ఇది లా వుండగా స్మార్ట్ సిటీని జీవీఎంసీలో కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెల ల కిందట ఉత్తర్వులు ఇచ్చిందని, ఆ కార్పొరేషన్ అధికారుల విజ్ఞప్తి మేరకే కేంద్ర ప్రభుత్వం మూడు వర్కింగ్ వుమెన్స్ హాస్టళ్ల నిర్మాణానికి రూ.174 కోట్లు కేటాయించిందని జీవీఎంసీ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఒక ప్రకటనలో పేర్కొనడం విశేషం.

డిగ్రీ స్పెషల్ కేటగిరీ అడ్మిషన్ల సర్టిఫికెట్ల పరిశీలన

మద్దిలపాలెం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు స్పెషల్ కేటగిరీల కింద దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు సర్టిఫికెట్ల పరిశీలన బుధవారంతో ముగియనున్నట్టు ప్రిన్సిపాల్ విజయబాబు తెలిపారు, స్పెషల్ కేటగిరీలైన ఎన్‌సీసీ, స్పోర్ట్స్, సీఏపీ (డిఫెన్స్), దివ్యాంగులు వంటి వర్గాలకు ఈనెల 1 నుంచి మూడో తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టామన్నారు. సోమ, మంగళవారాల్లో కొంతమంది విద్యార్థులకు ధ్రువపత్రాలు పరిశీలించి ప్రవేశాలు కల్పించినట్టు తెలిపారు. బుధవారంతో గడువు ముగయనుండడంతో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తప్పనిసరిగా సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని కోరారు.

మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతు చేపట్టండి

వెంకోజీపాలెం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 15వ వార్డు పాత వెంకోజీపాలెం ఉమానగర్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ మూసుకుపోవడంతో మురుగు అంతా రోడ్డుపై ప్రవహిస్తోంది. అసలే ఇరుకు రోడ్లు కావడంతో చిన్నారుల నుంచి పెద్దల వరకు ఈ మార్గంలో నడిచేందుకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇక్కడున్న పది మ్యాన్‌హోల్స్ కూడా బ్లాక్ అయిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కాలువల్లో పూడిక తొలగింపు



కాలువలో పూడిక తొలగిస్తున్న దృశ్యం

వెంకోజీపాలెం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 15వ వార్డులోని హెచ్‌బీ కాలనీ ఉక్కుకళా వేదిక రహదారి పక్కన కాలువల్లో వ్యర్థాలను మంగళవారం తీసి శుభ్రపరిచారు. దీంతో ఇన్నాళ్లా చిన్న వర్షం పడినా రోడ్డుపైకి వచ్చే మురుగునీటి సమస్య తీరనుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **పరదా** : శారద, శ్రీకన్య లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **మేఘాలు చెప్పిన ప్రేమకథ** : రమాదేవి, మోహిని (గాజువాక)
- **బన్ బట్టర్ జామ్** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య హెవెన్ (గాజువాక)
- **యూనివర్సిటీ** : శ్రీకాంతి
- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 29, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 32, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 30, బీరకాయలు 40, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 44, దొండకాయలు 42, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె) 10, మునక్కాడలు (కిలో) 62, అల్లం (పాతది) 72, బరబాటి 32, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 30, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 40, కంద 40, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	121
లైవ్ ధర	141
విత్ స్కిన్	252
స్కిన్‌లెస్	262

అనాథలకు పోలీసుల ఆసరా

» అభాగ్యులను ఆదరిస్తున్న ఖాకీలు » 'జ్యోతిర్గమయ' కింద సామాజిక సేవ



పునరావాస కేంద్రంలో అనాథలు, యాచకులు



మతిస్థిమితం లేని వ్యక్తికి క్షవరం చేయిస్తున్న దృశ్యం

బీచ్ రోడ్డు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నగర పోలీసు కమిషనర్ ఆలోచన ఎంతోమంది అనాథలకు ఆసరా కల్పిస్తోంది. ఇతర సమస్యలకూ పరిష్కారం చూపుతోంది. ఇందుకు కొందరు పోలీసులు శ్రమిస్తున్నారు.విధి నిర్వహణలో తీరిక లేకుండా గడిపే రక్షకభటులు అభాగ్యులకు అండగా నిలుస్తున్నారు. 'జ్యోతిర్గమయ' కార్యక్రమంలో భాగంగా విశాఖలో భిక్షాటన చేస్తున్న 243 మందికి ఆశ్రయం కల్పించి వారి సంబంధికులకు అప్పగిస్తున్నారు. వేలిముద్రల ఆధారంగా వారి ఆధార్ వివరాలు తెలుసుకొని బంధువులకు సమాచారం అందిస్తూ, వారికి అప్పగిస్తున్నారు. ఆర్కే బీచ్, ఆర్టీసీ కాంప్లెక్స్ రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తున్న వారిని గుర్తిస్తున్నారు.తొలుత వారిని ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత షెల్టర్లకు తరలిస్తున్నారు. ఎందరో అభాగ్యులు సేద తీరడానికి చోటులేక రోడ్ల పక్కన బస్టాప్‌లు, చెట్ల కింద తలదాచుకుంటున్నారు. దీంతో కొందరు బాల్యంలోనే పెడదారి పట్టి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు.



వృద్ధుడిని ఆశ్రమానికి తరలిస్తున్న పోలీసులు

జీవీఎంసీ ఆశ్రయం కల్పిస్తున్నా...

భిక్షాటన చేసుకునేవారికి జీవీఎంసీ ఆశ్రయం కల్పిస్తున్నా, తగిన వసతి సౌకర్యాలు లేకపోవడంతో ఎక్కువ మంది అక్కడ ఉండడానికి ఆసక్తి చూపడం లేదు. పాతబడిన భవనంలో ఉంటే వర్షాకాలంలో ఎప్పుడు పెచ్చులూడి పడిపోతుందోనని బిక్కుబిక్కుమంటూ జీవనం సాగించాల్సి వస్తోంది. జాతీయ పట్టణ జీవనోపాధి పథకం కింద వసతి కల్పించడానికి అవకాశం ఉన్నా నగర పాలక సంస్థ అధికారులు వెనకడుగు వేస్తున్నారు. అధికారులు చొరవ తీసుకొని అనాథలకు ఆశ్రయం కల్పించాలని పలువురు కోరు తున్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

గోపాలపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైలు కింద తలపెట్టి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సింహాచలం రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సింహాచలం రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్ శివారు పాత గోపాలపట్నం వద్ద ఓ యువకుడు మంగళవారం ఉదయం 9.30 గంటల సమయంలో రైలు పట్టాలపై పరుగు పెడుతూ విజయనగరం నుంచి విశాఖ వైపు వస్తున్న రైలు కింద తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

రైల్వే సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకున్నారు. మృతుని జేబులో లభించిన ఆధార్ కార్డును పరిశీలించగా ఆ యువకుడు ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా భేతాని గ్రామానికి చెందిన డిబాకర్ బదత్య (30)గా గుర్తించారు.

ఈ మేరకు మృతుడి కుటుంబీకులకు అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'విద్యకు దూరమయ్యే చిన్నారులను గుర్తించాలి'



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఆచార్య టీజీ అమృతవల్లి

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల నుంచి ఉన్నత పాఠశాల స్థాయికి వెళ్లే క్రమంలో బడి మానివేసిన విద్యార్థుల సంఖ్యను తగ్గించే దిశగా కృషి జరగాలని ఎన్‌సీటీఈ అండ్ ఆర్‌సీఐ ఇన్‌స్పెక్షన్ కమిటీ సభ్యులు ఆచార్య టీజీ అమృతవల్లి అన్నారు.

ఆంధ్రా యూనివర్సిటీలో మూడు రోజుల పాటు జరిగిన సీఆర్‌ఈ శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అమృతవల్లి మాట్లాడుతూ సాధారణ విద్యార్థులతో సమానంగా ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగ విద్యార్థులు సైతం భాగస్వాములయ్యే విధంగా చూడాలన్నారు. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి ఉన్నత పాఠశాల స్థాయి, ఆపై తరగతులకు వెళ్లే కొద్దీ విద్యకు దూరమవుతున్న విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని, దీన్ని వీలైనంత వరకు తగ్గించాలన్నారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆచార్య ఎన్.విజయమోహన్ మాట్లాడుతూ చిన్నారులందరికీ సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా జాతీయ విద్యావిధానం అమలు చేయడం ఒక చారిత్రాత్మకంగా నిలుస్తుందన్నారు. నాణ్యమైన విద్య ప్రతిచిన్నారి హక్కుగా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల విద్య ఆర్‌జేడీ వి.విజయభాస్కర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు, ప్రత్యేక అవసరాలు కలిగి విద్యార్థులకు ఉపయుక్తంగా జాతీయ విద్యావిధానం రూపకల్పన జరిగిందని వివరించారు. మండల స్థాయిలో ప్రత్యే పాఠశాలలు ఏర్పాటు చేయడం వల్ల వారి అవసరాలకు అనుగుణంగా విద్యను అందించడం సాధ్యపడుతుందన్నారు.

ఈ సందర్భంగా శిక్షణా తరగతుల్లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఏయూ విద్యా విభాగాధిపతి టి.షారోన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు

» పలు చోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించిన అభిమానులు



ఎంవీపీ కాలనీ :18వ వార్డులో రక్తదాతలకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న జనసేన నేతలు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) :ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా మంగళవారం 18వ వార్డులో రక్తదాన శిబిరం నిర్వహించారు. జనసేన నాయకుడు చీపల్లి ఎల్లాజీ ఆధ్వర్యంలో 45 మంది రక్తదానం చేశారు. జనసేన నాయకులు భోగిన శ్రీనివాస పట్నాయక్, పీతల వేణు, బొబ్బిలి రామకృష్ణ, సబ్బి శ్రీను, పీతల శ్రీను, ఆవల కిషోర్, మువ్వల సాయి తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ 17వ వార్డులోని హిడెన్ స్ప్రౌట్స్ దివ్యాంగుల పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం జనసేన నాయకులు బహుమతులు అందించారు. జనసేన రాష్ట్ర పర్యావరణ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రక్తదానం, అన్నదానం కార్యక్రమాల్ని నిర్వహించారు. జీవీఎంసీ 18 వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గొలగాని పోలారావు, జనసేన నాయకులు శ్రీనివాస పట్నాయక్, రమణారెడ్డి, భాను, ఎర్రాజీ, సాయికుమార్, ఎర్రయ్య, లలిత, ధనలక్ష్మి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిలపాలెంలో..

మద్దిలపాలెం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 22వ వార్డు పిఠాపురం కాలనీలోని కళాభారతి వద్ద మంగళవారం జనసేన పార్టీ నాయకులు దేవర రఘు ఆధ్వర్యంలో జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో జనసైనికులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సాయంత్రం భారీ కేక్ కట్ చేసి సందడి చేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పోతు వెంకటప్రసాద్, సైనికులు పాల్గొన్నారు.



మద్దిలపాలెం : రక్తదానం చేస్తున్న జనసైనికులు

పోలీసుల అదుపులో గోవులను తరలిస్తున్న ముఠా?

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సింహాచలం పరిధిలో అక్రమంగా గోవులను తరలిస్తున్న కొందరు ముఠా సభ్యులను గోపాలపట్నం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. గతనెల 30న సింహాచలంలో నివసిస్తున్న ఎర్రా శ్రీనివాసరావు అనే వ్యక్తికి చెందిన మూడు ఆవులు అదృశ్యమయ్యాయి.

ఈ మేరకు బాధితుడు గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సింహాచలం పరిసర ప్రాంతాల్లో అక్రమంగా ఆవులను తరలించే ముఠాపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో సింహాచలం పరిసర ప్రాంతంలో రోడ్లపై సంచరించే ఆవులను రాత్రి వేళలో కొందరు తరలిస్తున్నట్టు గుర్తించారు. ఇలా గోవులను తరలిస్తున్న పలువు రిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమా చారం. కాగా దీనిపై ఎస్ఐ తేజేశ్వరరావును వివరణ కోరగా గోవుల అదృశ్యంపై ఫిర్యాదు అందిందని, దీనిపై దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

జీవో.296 పట్టాలకు కన్వేయన్స్ డీడ్ రిజిస్ట్రేషన్లు

» జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్

మహారాణిపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జీవో నెం. 296 కింద మంజూరైన పట్టాలకు కన్వేయన్స్ డీడ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుపుకోవటానికి నిర్ణయించినట్టు జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలియజేశారు, 2015లో ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం జీవో నెంబరు 296 ద్వారా వెలువడిన ఉత్తర్వులను అనుసరించి ఇదివరకు మంజూరైన పట్టాలకు సంబంధించిన కన్వేయన్స్ డీడ్‌ను తయారు చేసినట్టు తెలిపారు.

ఈ నెల 2 నుంచి సంబంధిత రిజిస్టర్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టేందుకు నిర్ణయించి నట్టు తెలిపారు పెందుర్తి, ములగాడ, గాజువాక, గోపాలపట్నం, భీము నిపట్నం, విశాఖపట్నం రూరల్ మండలాలలో గల లబ్ధిదారులు తమ పరిధిలోని తాహశీల్దార్ల కార్యాలయాలు ద్వారా రిజిస్ట్రేషన్ టైమ్ స్లాట్స్ తెలుసుకొని సంబంధిత రిజిస్టర్ కార్యాలయాల్లో కన్వేయన్స్ డీడ్ రిజిస్ట్రేషన్‌కు హాజరు కావాలని ప్రకటనలో తెలియజేశారు.

'మత్తు'లోడు 'మ్యాడీ'

» మ్యాడీగా చెలామణి అవుతున్న నెల్లూరుకు చెందిన మధుసూదన్‌రెడ్డి » తెలుగు రాష్ట్రాల్లో డ్రగ్ నెట్‌వర్క్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

మ్యాడీ... వినడానికి ఈ పేరు చాలా స్టైల్‌గా ఉంది. మాదకద్రవ్యాల సరఫరా, విక్రయాల కోసం సృష్టించుకున్న పేరిది. ఈ మ్యాడీ ఎవరో కాదు వైజాగ్ ప్రేమికులకు ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీని సమకూర్చిన మల్లె మధుసూదన్‌రెడ్డి. నెల్లూరు జిల్లాకు చెందిన ఇతడు బెంగళూరులో ఉంటూ మాదకద్రవ్యాల సరఫరా, విక్రయం చేస్తాడు. వైజాగ్‌కు చెందిన అర్జా శ్రీవాత్సవ్, బొడ్డేపల్లి హవీల డిలైట్ డ్రగ్స్‌తో చిక్కడంతో మధుసూదన్‌రెడ్డి పేరు వెలుగులోకి వచ్చింది. మాచవరం పోలీసులు అతడి కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. శ్రీవాత్సవ్, హవీల పోలీసులకు పట్టుబడిన తర్వాత మధుసూదన్‌రెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లి పోయాడు. డ్రగ్స్ సరఫరాలో ఆరితేరిన అతడు అసలు పేరు తెలియకుండా పేరును సృష్టించుకున్నాడు. మధుసూదన్‌రెడ్డి పేరును ఇంగ్లీష్ రాస్తే వచ్చే మొదటి రెండు అక్షరాలు, చివరి మూడు అక్షరాలు కలిపి ఎంఏడీడీవై (మ్యాడీ) పేరును రూపొందించుకున్నాడు. డ్రగ్స్ కోసం సంప్రదింపులు చేసే వారందరికి ఇదే పేరును చెప్పేవాడు.

భారీగా 'తెలుగు' నెట్‌వర్క్

మధుసూదన్‌రెడ్డి రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న విద్యార్థులకు, యువకులకు ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ డ్రగ్స్‌ను భారీగానే సరఫరా చేసినట్టు తెలుస్తోంది. బెంగళూరులోనే ఈ డ్రగ్స్‌ను అందజేయడానికి 10-15 డ్రాపింగ్ పాయింట్లను ఏర్పాటు చేసుకున్నాడు. పేమెంట్ యాప్‌ల ద్వారా డ్రగ్స్‌కు సంబంధించిన చెల్లింపులు పూర్తయిన తర్వాత మాత్రమే సరుకు ఉన్న డ్రాపింగ్ పాయింట్‌ను వాట్సాప్‌లో పంపుతాడు. ముఖ్యంగా నగరాల్లో ఉన్న యువతీ యువకులతో మ్యాడీకి సంబంధాలు ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ విక్రయాలు సాగడానికి రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీగా నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నట్టు తెలుస్తోంది. శ్రీవాత్సవ్, హవీల చిక్కిన తర్వాత పోలీసులు జోగా లోహిత్ యాదవ్‌కు సంకెళ్లు వేసిన విషయం తెలిసిందే. అతడిని అదుపులోకి తీసుకున్న తర్వాత స్వరూపరాజు పేరు వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే స్వరూపరాజు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. మధుసూదన్‌రెడ్డిని పట్టుకోవడానికి రిమాండ్‌లో ఉన్న శ్రీవాత్సవ్, హవీల, లోహిత్‌ను కస్టడీలోకి తీసుకుని విచారించాలన్న యోచనలో పోలీసులు ఉన్నారు.

వైఎస్సార్‌కు నివాళులు

» వైసీపీ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాలు



వైఎస్సార్‌కు నివాళు అర్పిస్తున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, పలువురు నేతలు

మద్దిలపాలెం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెంలోని వైసీపీ కార్యాలయంలో మంగళవారం దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలోని వైఎస్ కాంస్య విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు కెకె రాజు మాట్లాడుతూ వైఎస్ అమలు చేసిన సంక్షేమ పథకాలు పేదలకు ఎంతగానో మేలు చేశాయన్నారు. ఆయన ప్రవేశపెట్టిన 108, ఆరోగ్యశ్రీ సేవలు పేదల ప్రాణాలు కాపాడుతున్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తైనాల విజయకుమార్, గురుమూర్తి రెడ్డి, వంకాయల మారుతీప్రసాద్, జాన్ వెస్లీ, రవిరెడ్డి, వైసీపీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అలాగే 22వ వార్డు శివాజీపాలెంలో వార్డు వైసీపీ అధ్యక్షుడు పీతల గోవింద్ ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి వేడుకలు నిర్వహించారు. వైఎస్ చిత్రపటానికి నాయకులు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 10వ వార్డులో వార్డు వైసీపీ అధ్యక్షుడు పతివాడ కనకరాజు ఆధ్వర్యంలో పలువురు వైఎస్ఆర్‌కు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైసీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కేఆర్ పాత్రుడు, జిల్లా కార్యదర్శి బొండా శ్రీను, నేతలు ఒమ్మి శ్రీను, వైదా నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీలో...

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 18వ వార్డు వైసీపీ అధ్యక్షుడు ఉమ్మిడి కల్యాణ్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఎంవీపీ కాలనీ తొమ్మిదో వార్డులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. నాయకులు పేర్ల విజయ్‌చంద్ర, మారుపల్లి పరదేశి, ధనలక్ష్మి, వాసుపల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎలీప్, సీఐఐ సంయుక్తంగా 11, 12 తేదీల్లో బిజినెస్ వర్క్‌షాప్

వెంకోజీపాలెం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ మహిళా పారిశ్రామికవేత్తల సంఘం (ఎలీప్), భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) సంయుక్తంగా మహిళలకు రెండు రోజుల బిజినెస్ వర్క్‌షాప్ ను ఈ నెల 11, 12 తేదీల్లో ఎంఎంటీసీ డాక్టర్స్ కాలనీలోని ఎలీప్ సంస్థ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు ఎలీప్ విశాఖ అధ్యక్షురాలు కె.రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా వ్యాపారవేత్తలు, ఎంఎస్ఎంఈ, స్టార్టప్‌లకు వ్యాపారాభివృద్ధి కోసం అవసరమైన జ్ఞానం, పరికరాలు అందించడమే లక్ష్యమన్నారు. ఆర్థిక వ్యవహారాలు, నగదు ప్రవాహం మెరుగుపరచడం, నిధుల కోసం సిద్ధం కావడం, సులభమైన పరికరాలతో టీమ్ శిక్షణ ఇవ్వడం, కస్టమర్ అవసరాలపై అవగాహన పెంపొందించి అమ్మకాలు పెంచడం, రెడీ టు యూజ్ టెంప్లేట్స్‌తో ఏఐ ప్రాథమికాలు నేర్చుకోవడం, స్థిరమైన వ్యాపార పరిష్కారాలు పొందడం వంటి అంశాలను ఈ వర్క్‌షాప్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. అందరికీ ఉచితంగా ఈ వర్క్‌షాప్‌నకు ప్రవేశం కల్పిస్తున్నట్టు ఆమె ప్రకటనలో పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ : 63014 41183లో సంప్రదించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

వినాయక ఉత్సవాల్లో అన్న సమారాధనలు



అన్నవితరణ చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి తనయుడు ప్రతాప్‌రుద్ర

వెంకోజీపాలెం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం 15వ వార్డు సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలోని గణపతి ఆలయం వద్ద మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు వెలగపూడి ప్రతాప్‌రుద్ర పాల్గొని భక్తులకు ప్రసాద వితరణ చేశారు. అంతకుముందు ఆలయంలో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, 15వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, బోర ధనరెడ్డి, సీహెచ్ గోవింద్, అప్పారి గిరిబాబు, కె.మహేష్, కర్రి గౌరీ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వినాయక నవరాత్రుల్లో భాగంగా 13, 10 వార్డుల్లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు వెలగపూడి ప్రతాపరుద్ర పాల్గొని భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో టీడీపీ 13వ వార్డు కార్యదర్శి ఎల్లమల్లి సురేష్, 13 వ వార్డు తెలుగు మహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి, క్లస్టర్ ఇన్‌చార్జి తురకపూడి బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలు



పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలకు హాజరైన బొలిశెట్టి సత్యనారాయణ తదితరులు

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వర్సిటీ ఉద్యోగి పైడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఆ పార్టీ నేత బొలిశెట్టి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా కిందిస్థాయి ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బందికి 150 రెయిన్ కోట్లు, మొక్కలు పంపిణీ చేశారు. నిస్వార్థ రాజకీయ నాయకుడు పవన్ కల్యాణ్ అని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏయూ ఉద్యోగులు పైడి శ్రీనివాస్, వెంకటేష్, సుబ్రహ్మణ్యం, అమరేంద్ర, సాయి బలరామ్, దేవుడు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

సీతమ్మధార, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గ బీజేపీ కార్యాలయంలో రూ.6,21,299 సీఎం రిలీఫ్‌ఫండ్‌ను ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా 45, 46, 47, 51, 53, 55వ వార్డులకు చెందిన లబ్ధిదారులు చెక్కులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మహారాజా బ్యాంక్ ఛైర్మన్ ఎంఆర్‌కే రాజు, బీజేపీ యువనాయకురాలు శ్యామల దీపిక, కూటమి నాయకులు పాల్గొన్నారు.

50వ వార్డులో

మురళీనగర్, (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 50వ వార్డుకు చెందిన సదాశివుని లక్ష్మికి ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వార్డు అధ్యక్షుడు ఎస్. వరప్రసాద్ మాట్లాడుతూ అనారోగ్యతో బాధపడుతున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరయ్యాయని, వారితో పాటు లక్ష్మికి రూ.70,875 ఆర్థిక సాయం అందినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయ శ్యామల దీపిక, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

డీఎస్సీ నియామకాలే ముందు పూర్తిచేయాలి

» ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమంత్ కుమార్



ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందిస్తున్న హేమంత్ కుమార్

సీతంపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నియామకాలు పూర్తి చేసిన తరువాతే పోలీసు నియామకాలు చేయాలని కోరుతూ రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు, ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హేమంత్ కుమార్ మాట్లాడుతూ డీఎస్సీ ఉద్యోగంతో పాటు పోలీసు ఉద్యోగానికి అర్హత సాధించిన అభ్యర్థుల నుంచి ఏపీఎస్‌ఎల్ఆర్బీ వారు అన్‌విల్లింగ్ పత్రాన్ని తీసుకోగలిగితే మిగిలిన ఉద్యోగాలను మిగతా అభ్యర్థులకు కేటాయించవచ్చని, లేని పక్షంలో అవి క్యారీ ఫార్వార్డ్ బ్యాక్‌లాగ్‌గా మిగిలిపోతాయని పల్లా శ్రీనివాస్‌కు తెలిపారు. గత ప్రభుత్వంలో ఒక్క కానిస్టేబుల్ ఉద్యోగం, డీఎస్సీ ఉద్యోగం ఇవ్వక పోవడంతో అభ్యర్థులందరూ ఐదు సంవత్సరాలు కోచింగ్ సెంటర్లలో లక్షలాది రూపాయిలు ఖర్చు పెట్టి విసిగి పోయారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కానిస్టేబుల్ అభ్యర్థులకు స్టైఫండ్ కూడా తెలంగాణ తరహాలో పెంచే విధంగా కృషి చేయాలని, రాష్ట్ర విభజన సమయంలో స్టేట్ క్యాడర్ తెలంగాణలో ఉండిపోయిన ఉద్యోగాలను ఏపీకి బదిలీ చేయించే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ పెద్దలు, అధికారులతో చర్చించి న్యాయం చేస్తామని పల్లా హామీ ఇచ్చారు.

స్కంధ గణపతిగా దుర్గాగణపతి

సీతంపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా సీతంపేట కూడలిలో ఉన్న దుర్గాగణపతి ఆలయంలో విఘ్నేశ్వరుడు స్కంధ గణపతి రూపంలో దర్శనమిచ్చారు. చవితి ఉత్సవాలు దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి రమాభాయి, కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

ఘనంగా జనసేనాని జన్మదిన వేడుకలు



కేక్ కోస్తున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, తదితర నాయకులు



పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా పేద కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న 51వ వార్డు నాయకులు

సీతంపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో కేకును కట్ చేసి పవన్ కల్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఒకరికొకరు కేకు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ మాట్లాడారు. 'ఈ రోజు మా అధినేత పవన్ కల్యాణ్ పుట్టిన రోజు అంటే మా అందరికి పండుగలాంటిది' అని ఆయన పేర్కొన్నారు. అనంతరం కార్యాలయంలో 27వ వార్డు అధ్యక్షుడు గుండు సురేశ్‌బాబు చంటి, జిమ్ మణి సమక్షంలో ఏర్పాటు చేసిన బ్లడ్ డొనేషన్ క్యాంపులో పవన్ అభిమానులు రక్తదానం చేశారు. ఐఐహెచ్‌పీ విశాఖ జిల్లా యూనిట్ ఏర్పాటు చేసిన ఫ్రీ హోమియో మెడికల్ క్యాంపులో మందులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు రెహమాన్, కార్పొరేటర్ కందుల నాగరాజు, సౌత్ ఇన్‌చార్జి శివప్రసాద్ రెడ్డి, తదితర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు ఆర్థిక సాయం

మురళీనగర్, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా 51వ వార్డు నాయకులు పేద కుటుంబాలకు చెందిన వారికి రూ.25వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా వార్డు అధ్యక్షుడు జి.అప్పారావు మాట్లాడుతూ వార్డులోని గాంధీనగర్‌కు చెందిన బాల వర్ధిని అనే 10వ తరగతి విద్యార్థినికి స్కూల్ ఫీజ్ నిమిత్తం రూ.10వేలు, వైద్య ఖర్చుల నిమిత్తం మహత్‌కాలనికి చెందిన ఈశ్వరరావుకు రూ.5 వేలు, మరో ఇంట్లో రాము అనే వ్యక్తికి రూ.5వేలు అందజేశామని తెలిపారు. అలాగే అంబేడ్కర్ కాలనీలో దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న టి.శెట్టి కుమారికి రూ.5 వేలు సాయంగా అందజేసినట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

అనాథ శరణాలయంలో వేడుకలు

కంచరపాలెం, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను 54వ వార్డులో జనసేన అభిమానులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో నియోజకవర్గ సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక జనరేషన్ యువ అనాథ బాలల సంరక్షణ కేంద్రంలో కేకును కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులకు పండ్లు, స్వీట్లు, ఆహార పొట్లాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దివంగత సీఎం వైఎస్సార్‌కు నివాళి



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కేకే.రాజు, కార్పొరేటర్ అనిల్‌కుమార్ రాజు

సీతమ్మధార, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దివంగత సీఎం డాక్టర్ వైఎస్. రాజశేఖర్‌రెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా 14వ వార్డులోని ఉన్న పాపా హోమ్‌లో పిల్లలకు అల్పాహారం, భోజనాన్ని పంపిణీ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కేకే.రాజు, కార్పొరేటర్ అనిల్‌కుమార్ రాజు విద్యార్థులకు వడ్డన చేశారు. అలాగే 25వ వార్డు సీతంపేట కూడలిలో వైసీపీ నాయకుడు బోగవల్లి గోవింద్ ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కళింగనగర్‌లో...

మాధవధార, (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 51వ వార్డు కళింగనగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో వైఎస్. రాజశేఖర్ రెడ్డి 16వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రెయ్యి.వెంకటరమణ మాట్లాడుతూ వైఎస్సార్ చేసిన సేవలు ఎప్పటికీ ప్రజల గుండెల్లో నిలిచి పోతాయని అన్నారు. వైఎస్సార్ అజరామర కీర్తిమంతుడని కొనియాడారు. అనంతరం వార్డులోని నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

వసుధ ఫార్మా డైరెక్టర్ ఫోన్ కోసం పోలీసుల గాలింపు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్ పోలీస్ స్టేషన్ పరిధి ప్రగతి మైదానంలో ఆత్మహత్యకు పాల్పడిన వసుధ ఫార్మా డైరెక్టర్ మంతెన సూర్యనాగ వరప్రసాదరాజు ఫోన్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. సోమవారం ఆత్మహత్యకు పాల్పడిన ప్రసాదరాజు ఫోన్‌ను ఓ గుర్తు తెలియని వ్యక్తి లిఫ్ట్ చేసి అతను చనిపోయాడని చెప్పాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్న సమయంలో ఆ ఫోన్ లభ్యం కాలేదు. ఆ నంబర్‌కు కాల్ చేస్తే ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోందని పోలీసులు తెలిపారు.

హోంగార్డు ఉద్యోగాలకు నోటిఫికేషన్

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏడు హోంగార్డు ఉద్యోగాల భర్తీకి సీపీ శంఖబ్రతబాగ్చి నోటిఫికేషన్ జారీచేశారు. కమిషనరేట్ పరిధికి చెందిన పురుష, మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని సీపీ పేర్కొన్నారు. అభ్యర్థులు 21 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు కలిగి, ఏదైనా గుర్తింపుపొందిన యూనివర్సిటీ నుంచి ఫోరెన్సిక్ సైన్స్‌లో డిప్లమో/డిగ్రీ/పీజీ చేసి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చేనెల మూడు, నాలుగు తేదీల్లో దరఖాస్తుల పరిశీలన, 12న 75 మార్కులకు గంటన్నర పాటు రాతపరీక్ష ఉంటుందని ఎంపికైన వారికి రోజుకు రూ.710 చొప్పున గౌరవ వేతనం అందజేస్తామన్నారు.

ద్విచక్ర వాహనదారుడి మృతి



అలుపుల శంకరరావు

మహారాణిపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాన్వెంట్ జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రసాద్ గార్డెన్స్‌కు చెందిన అలుపుల శంకరరావు(32) అనే ఆటో 0డ్రైవర్ మంగళవారం రాత్రి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. శంకరరావు మంగళవారం రాత్రి ద్విచక్రవాహనం మీద ఇంటి నుంచి గాజువాక వెళుతుండగా కాన్వెంట్ జంక్షన్ దగ్గరకు వచ్చే సరికి గుర్తు తెలియని వాహనం అతనిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. హార్బర్ పోలీసులకు సమాచారం అందడంతో ఏఎస్ఐ మూర్తి, సిబ్బంది కనకరాజు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. ప్రమాదానికి ఆర్‌టీసీ బస్సుగా భావిస్తున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

'మత్తు'లోడు 'మ్యాడీ'

» మ్యాడీగా చెలామణి అవుతున్న నెల్లూరుకు చెందిన మధుసూదన్‌రెడ్డి

» తెలుగు రాష్ట్రాల్లో డ్రగ్ నెట్‌వర్క్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

మ్యాడీ... వినడానికి ఈ పేరు చాలా స్టైల్‌గా ఉంది. మాదకద్రవ్యాల సరఫరా, విక్రయాల కోసం సృష్టించుకున్న పేరిది. ఈ మ్యాడీ ఎవరో కాదు వైజాగ్ ప్రేమికులకు ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీని సమకూర్చిన మల్లె మధుసూదన్‌రెడ్డి. నెల్లూరు జిల్లాకు చెందిన ఇతడు బెంగళూరులో ఉంటూ మాదకద్రవ్యాల సరఫరా, విక్రయం చేస్తాడు. వైజాగ్‌కు చెందిన అర్జా శ్రీవాత్సవ్, బొడ్డేపల్లి హవీల డిలైట్ డ్రగ్స్‌తో చిక్కడంతో మధుసూదన్‌రెడ్డి పేరు వెలుగులోకి వచ్చింది. మాచవరం పోలీసులు అతడి కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. శ్రీవాత్సవ్, హవీల పోలీసులకు పట్టుబడిన తర్వాత మధుసూదన్‌రెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లి పోయాడు. డ్రగ్స్ సరఫరాలో ఆరితేరిన అతడు అసలు పేరు తెలియకుండా పేరును సృష్టించుకున్నాడు. మధుసూదన్‌రెడ్డి పేరును ఇంగ్లీష్ రాస్తే వచ్చే మొదటి రెండు అక్షరాలు, చివరి మూడు అక్షరాలు కలిపి ఎంఏడీడీవై (మ్యాడీ) పేరును రూపొందించుకున్నాడు. డ్రగ్స్ కోసం సంప్రదింపులు చేసే వారందరికి ఇదే పేరును చెప్పేవాడు.

భారీగా 'తెలుగు' నెట్‌వర్క్

మధుసూదన్‌రెడ్డి రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న విద్యార్థులకు, యువకులకు ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ డ్రగ్స్‌ను భారీగానే సరఫరా చేసినట్టు తెలుస్తోంది. బెంగళూరులోనే ఈ డ్రగ్స్‌ను అందజేయడానికి 10-15 డ్రాపింగ్ పాయింట్లను ఏర్పాటు చేసుకున్నాడు. పేమెంట్ యాప్‌ల ద్వారా డ్రగ్స్‌కు సంబంధించిన చెల్లింపులు పూర్తయిన తర్వాత మాత్రమే సరుకు ఉన్న డ్రాపింగ్ పాయింట్‌ను వాట్సాప్‌లో పంపుతాడు. ముఖ్యంగా నగరాల్లో ఉన్న యువతీ యువకులతో మ్యాడీకి సంబంధాలు ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ విక్రయాలు సాగడానికి రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీగా నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నట్టు తెలుస్తోంది. శ్రీవాత్సవ్, హవీల చిక్కిన తర్వాత పోలీసులు జోగా లోహిత్ యాదవ్‌కు సంకెళ్లు వేసిన విషయం తెలిసిందే. అతడిని అదుపులోకి తీసుకున్న తర్వాత స్వరూపరాజు పేరు వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే స్వరూపరాజు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. మధుసూదన్ రెడ్డిని పట్టుకోవడానికి రిమాండ్‌లో ఉన్న శ్రీవాత్సవ్, హవీల, లోహిత్‌ను కస్టడీలోకి తీసుకుని విచారించాలన్న యోచనలో పోలీసులు ఉన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ మెరిట్ జాబితా ప్రకారం రెండో విడత అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన మంగళవారం ఉక్కు నగరంలోని విశాఖ విమల విద్యాలయంలో నిర్వహించారు. మొత్తం 82 మంది అభ్యర్థులు హాజరుకాగా, వారి కోసం నాలుగు కౌంటర్లు ఏర్పాటుచేశారు. వెరిఫికేషన్ ప్రక్రియను విద్యా శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయ్‌భాస్కర్, జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ పర్యవేక్షించారు. కాగా, కాల్ లెటర్‌లు అందుకున్న అభ్యర్థులు పలువురు వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నందున బుధవారం వచ్చేందుకు అవకాశం కల్పించారు.

నక్కవానిపాలెంలో అన్నదానం

సీతమ్మధార, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా 24వ వార్డు నక్కవానిపాలెంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద యూనిటీ బాయ్స్ ఏర్పాటు చేసిన గణనాథుని మండపం వద్ద మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సాడి పద్మరెడ్డి, కోన గోవింద్, నాయకులు పాల్గొన్నారు.

'స్మార్ట్ సిటీ'పై ఇన్‌చార్జి మంత్రి ఆరా

... 5వ పేజీ తరువాయి

భవన నిర్మాణానికి టెండర్లు పిలవడంతో షాక్‌కు గురయ్యానని, దీనిపై స్మార్ట్ సిటీ అధికారులకు సోమవారం నోటీస్ జారీచేశానని వివరించినట్టు తెలిసింది. ఇది లావుండగా స్మార్ట్ సిటీని జీవీఎంసీలో కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెల ల కిందట ఉత్తర్వులు ఇచ్చిందని, ఆ కార్పొరేషన్ అధికారుల విజ్ఞప్తి మేరకే కేంద్ర ప్రభుత్వం మూడు వర్కింగ్ వుమెన్స్ హాస్టళ్ల నిర్మాణానికి రూ.174 కోట్లు కేటాయించిందని జీవీఎంసీ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఒక ప్రకటనలో పేర్కొనడం విశేషం.

భక్తుల నిలుపుదోపిడీ

... 5వ పేజీ తరువాయి

నేరుగా భక్తుల నుంచి వంద రూపాయలు తీసుకుని దర్శనానికి పంపుతున్నారు. అదేవిధంగా వినాయక విగ్రహాల వద్ద ఫొటో తీసుకునేందుకు అరవై రూపాయలు, శివలింగ రూపంలో ఉన్న లడ్డూను దర్శించుకునేందుకు ఇరవై రూపాయలు, ఇతరత్రా విగ్రహాల దర్శనం కోసం మరికొంత...వసూలు చేస్తున్నారు. ఈ పరిస్థితి గాజువాకలో ఏర్పాటుచేసిన రెండు భారీ విగ్రహాల వద్ద కొనసాగుతోంది. ఇప్పటికైనా పోలీస్ శాఖ కళ్లు తెరవాలని భక్తులు కోరుతున్నారు.

ఘనంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు



మహారాణిపేట : రక్తదానం చేస్తున్న మ్యాల శ్రీనివాస్ తదితరులు

జ్ఞానాపురం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను మంగళవారం జనసైనికులు ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 32వ వార్డులో కార్పొరేటర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో నేరెళ్ల కోనేరు వద్ద పలువురు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. 41 వార్డు అధ్యక్షుడు అంతొని శేఖర్ ఆధ్వర్యంలో, 56వ వార్డులోని గవర కంచరపాలెంలో పెంటకోట శివ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించారు. గవర కంచరపాలెంలో మహాత్మా గాంధి క్యాన్సర్ ఆస్పత్రి,మెడికవర్, అను హాస్పిటల్, డాక్టర్ అగర్వాల్ కంటి ఆస్పత్రి సహకారంతో మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని జనసేన పశ్చిమ ఇన్‌చార్జ్ అంగ ప్రశాంతి ప్రారంభించారు. కార్యక్రమంలో బీశెట్టి వెంకట్రావు, మళ్ల బలరాం, గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మహారాణిపేటలో..

మహారాణిపేట, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ జంక్షన్‌లోని మహిళా సమాఖ్య భవన్ వికలాంగుల హాస్టల్‌లో మంగళవారం ఘనం గా వేడుకలు నిర్వహించారు. జనసేన పార్టీ సీనియర్ నాయకుడు మన్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం వికలాంగులకు రేషన్ సరుకులు అందించారు. ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ అభిమానులు 50 మంది వరకు రక్తదానం చేశారు.కార్యక్రమంలో ఇల్లపు శ్రీను, కనకల రాజు రమణ, దుక్క ప్రసాద్, నడిపూరి రాజు, పలువురుజనసైనికులు, వీర మహిళలు, జనసేన స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జ్ఞానాపురం: వైద్యశిబిరం ఏర్పాటు చేసిన జనసేన నాయకులు

41వ వార్డులో వైఎస్సార్‌కు ఘన నివాళి



అనాథలకు అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ పూర్ణిమాశ్రీధర్

జ్ఞానాపురం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 16వ వర్ధంతిని మంగళవారం 41వ వార్డు కార్పొరేటర్ కొడిగుడ్ల పూర్ణిమా శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికిపూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం నగరంలోని మానసిక వికలాంగుల ఆశ్రమంలో అనాథలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వార్డు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పారిశ్రామికవేత్తలకు నమస్కరిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

ప్రతి 6 నెలలకు మారీటైమ్ సదస్సు

... 5వ పేజీ తరువాయి

నుంచి సీ కేబుల్ వస్తుందని చెప్పారు. త్వరలో అమరావతికి బుల్లెట్ ట్రైన్ కూడా వస్తుందని చెప్పారు. స్టీల్ ఉత్పత్తుల రవాణా కోసం ప్రత్యేకంగా ఒక పోర్టు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. షిప్పింగ్ లైన్స్‌కు చెందిన త్రిపాఠి మాట్లాడుతూ, షిప్ రిపేర్లకు 200 నుంచి 300 ఎకరాలు కేటాయించాలని కోరగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

చెదలుపడుతున్న ఫుడ్ లేబొరేటరీ!

... 5వ పేజీ తరువాయి

విశాఖలో పెద్దఎత్తున హోటల్స్, రెస్టారెంట్‌లు, బేకరీల్లో తనిఖీలు నిర్వహించారు. అనేకచోట్ల కెమికల్స్, ఇతర రసాయనాలు వినియోగించినట్టు అనుమానం రావడంతో నమూనాలను సేకరించి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించారు. అయితే, ఆ ఫలితాలు ఇప్పటివరకూ రాకపోవడం ఆయా హోటళ్లపై చర్యలు తీసుకోవడానికి ప్రతిబంధకంగా మారిందని అధికారులు చెబుతున్నారు.

నిరుపయోగంగా పరికరాలు

కేంద్ర ప్రభుత్వం ఏపీతోపాటు మరికొన్ని రాష్ట్రాలకు ఈ ల్యాబ్‌లను మంజూరుచేసింది. ఏపీలో మూడు ల్యాబ్‌ల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఒక్కో ల్యాబ్ ఏర్పాటు, పరికరాలు కోసం సుమారు రూ.30 కోట్లు కేటాయించింది. అయితే, ఈ మూడుచోట్ల కూడా ల్యాబ్‌లు ప్రారంభమైనా సేవలు ఇంకా అందుబాటులోకి రాలేదు. ల్యాబ్‌లు నిరుపయోగంగా ఉండడానికి ఉన్నతాధికారుల నిర్లక్ష్యమే కారణంగా పేర్కొంటున్నారు. ఏడాది కిందట సుమారు రూ.15 కోట్ల విలువజేసే అత్యాధునిక పరికరాలు ల్యాబ్‌కు చేరాయి. ఈ పరికరాలను ఇప్పటివరకూ బయటకు తీయలేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆహార నాణ్యత, రసాయనాలు వినియోగం, పాయిజన్, ఆరోగ్యానికి హాని కలిగించే ఇతర పదార్థాలు వినియోగం, కలుషిత నీటి నిర్ధారణ వంటి పరీక్షల నిర్వహణకు అవసరమైన అత్యాధునిక హాట్ ఎయిర్ ఒవెన్, మఫుల్ ఫర్నేస్, వాటర్ బాత్, ఎల్‌సీ-ఎంఎస్, జీసీ-ఎంఎస్, ఐసీపీ ఎంఎస్, బాలెన్స్, ఆటో క్లేవ్, మైక్రోస్కోప్ వంటి 60 పరికరాలు ల్యాబ్‌లో నిరుపయోగంగా పడి ఉన్నాయి. అలాగే, సుమారు రూ.2 కోట్ల విలువైన కెమికల్స్ ఉన్నాయని, ఇవి రోజులు గడిచినకొద్దీ వినియోగించలేని స్థితికి చేరుకుంటాయని నిపుణులు చెబుతున్నారు. ఈ పరికరాల ద్వారా బిస్కెట్స్, పాలు, పాల ఉత్పత్తులు, ఆయిల్స్, సాఫ్ట్ డ్రింక్స్ వంటి 17 రకాల ఆహార పదార్థాలను పరీక్షించేందుకు అవకాశం ఉంది. ఈ ల్యాబ్ నిర్వహణకు అవసరమైన సుమారు 70 మంది సిబ్బందిని నియమిస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించింది. కానీ, ఇప్పటివరకూ ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. ల్యాబ్ అందుబాటులోకి రాకపోవడానికి అది కూడా ప్రధానమైన అడ్డంకిగా మారినట్టు చెబుతున్నారు.

జేఎన్ఎన్‌యూఆర్ఎం బస్సుల ఆధునికీకరణకు రూ.కోటి

... 5వ పేజీ తరువాయి

ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఈ బస్సులను అశోక్ లేల్యాండ్ సంస్థ తయారుచేసింది. ఆర్టీసీ అధికారులు ఆ సంస్థ ఇంజనీరింగ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో నలుగురు సాంకేతిక నిపుణులు వచ్చి స్టీల్ డిపోలో ఉన్న 17 జేఎన్ఎన్‌యూఆర్ఎం బస్సులను సోమ, మంగళవారాల్లో పరిశీలించారు. ఇంజన్ల ఫిట్‌నెస్, ఎలక్ట్రికల్ వైరింగ్, బాడీ ఫిటింగ్, తదితర అంశాలపై సమీక్షించారు. పదేళ్లుగా నడుస్తుండడంతో ఆధునికీకరణ అవసరమని నిర్ధారించారు.పలు విడిభాగాలు, ఇంజన్ పూర్తి సర్వీసింగ్, బాడీ రీఫిట్టింగ్, ఎలక్ట్రికల్ వైరింగ్ చేపట్టాలని సూచించారు. ఇందుకోసం సుమారు రూ.కోటి ఖర్చవుతుందని కొటేషన్ ఇచ్చారు.దీనిని ఆర్ఎం అప్పలనాయుడు ఆర్టీసీ ప్రధాన కార్యాలయానికి పంపారు. అనుమతి వచ్చిన వెంటనే బస్సుల ఆధునికీకరణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

దేవదాయ శాఖలో ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

ఏఈ పోస్టు లేదు. కాబట్టి ఆ పోస్టింగ్ చెల్లదు. కానీ వడ్డించే వాడు మనవాడే కాబట్టి, పైగా సంఘం నాయకుడు కూడా కావడంతో కళ్లు మూసుకొని కనకమహాలక్ష్మి దేవస్థానం అధికారులు చేర్చేసుకున్నారు. ఆయనకు తెలిసింది మెకానికల్ పని. కనకమహాలక్ష్మి ఆలయంలో ఆ పనులు లేవు. దాంతో అయ్యవారు నచ్చినప్పుడల్లా సింహాచలం వెళ్లిపోతున్నారు. అక్కడ వీఐపీల సేవలో తరిస్తున్నారు. దీనిని అడిగే నాథుడే లేడు. ఆలయ ఈఓ వెనుక తిరుగుతూ సివిల్ ఇంజనీరింగ్ పనుల్లో తల దూరుస్తున్నా పట్టించుకోవడం లేదు. ప్రజా ప్రతినిధులు కూడా పైరవీకారులకే కొమ్ము కాస్తున్నారు. ఇలాంటి అడ్డగోలు ఉత్తర్వులు ఇస్తున్న ఉన్నతాధికారుల తీరుపై కూడా ప్రభుత్వం ఓ కన్ను వేయాల్సిన అవసరం ఉంది.

గీత కార్మికుల బార్‌లు కొట్టేసిన సిండికేట్లు?

... 5వ పేజీ తరువాయి

చేసినట్టు మద్యం వ్యాపారంలో ఉన్నవారే ఆరోపిస్తున్నారు. గీత కార్మికుల కోటాలో బార్‌లు కేటాయించిన అధికారులు ఆయా లైసెన్స్ ఫీజు కింద చెల్లింపులు ఎవరి బ్యాంకు ఖాతాల నుంచి జరిగాయనేది పరిశీలిస్తే వాస్తవాలు బయటపడతాయని, దీనిపై ఏసీబీ, విజిలెన్స్ అధికారులు దృష్టిసారించాలని మద్యం వ్యాపారులు కొందరు డిమాండ్ చేస్తున్నారు. గీత కార్మికుల ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం లైసెన్స్ ఫీజులో సగం రాయితీ కల్పిస్తే దానిని సిండికేట్లు కొట్టేయడం దారుణమంటున్నారు. ఈ విషయం ఎక్సైజ్ శాఖలోని ఉన్నతాధికారుల వద్ద ప్రస్తావించగా, మద్యం వ్యాపారుల్లో వర్గ విభేదాల కారణంగానే ఇలాంటి ఆరోపణలు వస్తున్నాయన్నారు. వారి ఆధిపత్యం కోసం తమపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని కొట్టిపారేశారు.

డబుల్ డెక్కర్ టికెట్ ధర పెద్దలకు రూ.250, పిల్లలకు రూ.100

... 5వ పేజీ తరువాయి

పార్కు, రుషికొండ బీచ్‌ల వద్ద టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. రోజులో ఒకసారి (కాలపరిమితి 24 గంటలుగా నిర్ణయించారు) టికెట్ తీసుకుని ఆర్కే బీచ్ నుంచి తొట్లకొండ వరకూ ఎన్నిసార్లు అయినా ప్రయాణించవచ్చు. ఆర్కే బీచ్, సబ్‌మెరైన్, హెలికాప్టర్ మ్యూజియం, విశాఖ మ్యూజియం, వీఎంఆర్‌డీఏ పార్కు, కైలాసగిరి రోప్‌వే, తెన్నేటి పార్కు, ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కు, ఇస్కాన్ టెంపుల్, టీటీడీ టెంపుల్, రుషికొండ బీచ్, తొట్లకొండల వద్ద డబుల్ డెక్కర్ బస్సులు ఆగుతాయి.

నేత్ర వైద్య శిబిరం

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రౌండ్ టేబుల్ ఇండియా, లేడీస్ సర్కిల్ ఇండియా బ్యానర్, వైజాగ్ నైట్స్ రౌండ్ టేబుల్ 225, వైజాగ్ నైట్స్ లేడీస్ సర్కిల్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం డాబాగార్డెన్స్‌లోని పాఠశాలలో ఉచిత వైద్య, నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బెంగళూరుకు చెందిన అలోక ఫౌండేషన్‌కు చెందిన వైద్య నిపుణులు మాట్లాడుతూ స్వేచ్ఛ అనే ఆర్టీఐ నినాదానికి అనుగుణంగా సమగ్ర విద్యార్థుల శ్రేయస్సును ప్రోత్సహించడం లక్ష్యంగా ఉచిత శిబిరాన్ని నిర్వహించారు.



ఎంపీ శ్రీభరత్‌తో మాట్లాడుతున్న ఉక్కు అధికారుల సంఘం ప్రతినిధులు

వేతనాలు చెల్లించేలా చూడాలని ఎంపీకి వినతి

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు తక్షణమే వేతనాలు, బకాయి పడిన జీతాలు చెల్లించేలా చూడాలని ఎంపీ ఎం.శ్రీభరత్‌కు ఉక్కు అధికారుల సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఎంపీని నగరంలో ఆయన కార్యాలయంలో కలిసి పలు సమస్యలను వారు విన్నవించారు. మూడో బ్లాక్ ఫర్నేస్ ప్రారంభించినప్పటికీ తగిన ముడిసరకు లభ్యం కావడం లేదని, దీనివల్ల ఉత్పత్తి వ్యయం పెరుగుతుందన్నారు. అలాగే అధికారులకు పదోన్నతులు కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. ఉక్కు ప్రైవేటీకరణ ప్రక్రియను కేంద్రం విరమించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీని కలిసిన వారిలో అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి కేవీడీ ప్రసాద్, ఉపాధ్యక్షుడు టి.శ్రీనివాస్ ఉన్నారు.

'నాస్కామ్'తో విజ్ఞాన్ ఎంవోయూ

అగనంపూడి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల నాస్కామ్ సంస్థతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) చేసుకుంది. ఈ మేరకు మంగళవారం నాస్కామ్ సంస్థ డైరెక్టర్ వి.ఉదయ్‌శంకర్, విజ్ఞాన్ ప్రిన్సిపాల్ అరుంధతి ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమలతో అనుసంధానం, కెరీర్ వృద్ధికి అనువైన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో నాస్కామ్ సంస్థతో ఎంవోయూ చేసుకున్నామన్నారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి డి.మనేంద్ర సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం

మల్కాపురం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను నగరంలోని చౌల్ట్రీ నుంచి గాజువాక రిజిస్ట్రేషన్ కార్యాలయానికి మార్పు చేశారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ఆమడ దూరంలో రిజిస్ట్రేషన్ కార్యాలయం' అనే కథనానికి స్పందించిన అధికారులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను చౌల్ట్రీ నుంచి గాజువాక రిజిస్ట్రేషన్ కార్యాలయానికి మార్పు చేయడం పట్ల పలువురు లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా మంగళవారం ఒక్క రిజిస్ట్రేషన్ మాత్రమే జరిగింది. ఎటువంటి రుసుం లేకుండా రిజిస్ట్రేషన్లు జరుగుతాయని లబ్ధిదారులకు సమాచారం అందడంతో పలువురు లబ్ధిదారులు గాజువాక రిజిస్ట్రేషన్ కార్యాలయానికి చేరుకున్నారు. అయితే ప్రభుత్వం పేరిట రూ.500 డీడీ, లేదా ఆన్‌లైన్ పేమెంట్ చేయాల్సి ఉంటుందని సబ్ రిజిస్ట్రార్ చెప్పడంతో ఈ ప్రక్రియకు కాస్త బ్రేక్ పడింది. ఈ మొత్తాన్ని చెల్లిస్తే సచివాలయ సిబ్బంది లబ్ధిదారుడి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. అప్పుడు రిజిస్ట్రార్ ఆ వివరాలను పరిశీలించాక రిజిస్ట్రేషన్ చేస్తారు. ఈ రిజిస్ట్రేషన్ పత్రాలపై తహశీల్దార్, వీఆర్‌వో సంతకాలు ఉంటాయి.

సినిమా గైడ్

- **పరదా** : శారద, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **మేఘాలు చెప్పిన ప్రేమకథ** : రమాదేవి, మోహిని (గాజువాక)
- **బన్ బటర్ జామ్** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య హెవెన్ (గాజువాక)
- **యూనివర్సిటీ** : శ్రీకాంతి
- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 29, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 32, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 30, బీరకాయలు 40, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 44, దొండకాయలు 42, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 62, అల్లం (పాతది) 72, బరబాటి 32, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 30, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 40, కంద 40, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

చికెన్ ధరలు	
బ్రాయిలర్	
రైతు ధర	121
లైవ్ ధర	141
విత్ స్కిన్	252
స్కిన్‌లెస్	262

సీఎం చంద్రబాబు పాలనలో శరవేగంగా రాష్ట్రాభివృద్ధి

» 'పశ్చిమ' ఎమ్మెల్యే పి.గణబాబు

గోపాలపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడంతో పాటు దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్ర జాబితాలో చేరిందని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. మంగళవారం తమ నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 30 ఏళ్లు అయిందని, గడిచిన మూడు దశాబ్దాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధిలో చంద్రబాబు చెరగని ముద్ర వేశారన్నారు. రాష్ట్రాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి దూరదృష్టితో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని పేర్కొన్నారు. చంద్రబాబు పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. డ్వాక్రా సంఘాలతో మహిళల అభ్యున్నతి, బీసీ మహిళలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించడంతో పాటు స్త్రీశక్తి పథకంతో మహిళల సంక్షేమం కోసం చంద్రబాబు విశేష కృషి చేశారన్నారు.



పట్టాల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న గణబాబు

ఇళ్ల పట్టాలిస్తున్న ఘనత చంద్రబాబుదే..

వేపగుంట: గతంలో అధికారంలో ఉన్నప్పుడు నిరుపేదల స్థలాలకు పట్టాలు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీని ప్రస్తుతం పంపిణీ చేస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. సింహపురికాలనీలో గల గోపాలపట్నం రిజిస్ట్రార్ కార్యాలయంలో జీవో నంబర్-296 కింద జారీ చేసిన 16 వేల ఇళ్ల పట్టాలను క్రమబద్ధీకరిస్తూ చేపట్టిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను మరచిపోకుండా కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. తొలిరోజు గోపాలపట్నం ఇందిరానగర్‌కు చెందిన కొండవాలు ప్రాంతవాసులకు 28 పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ రమేశ్, స్టాంప్స్ డీఐజీ బాలకృష్ణ, రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకుడు మూర్తియాదవ్, తదితరులు పాల్గొన్నారు.



జనసైనికులతో కలిసి రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు



తమ నివాసంలో కేక్ కట్ చేసిన జనసేన నేత బెహరా భాస్కరరావు

ఘనంగా పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు

రక్తదానం చేసిన ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, సినీ నటుడు కె.పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సుజాతనగర్‌లోని దాట్ల కన్వెన్షన్‌లో జనసైనికులు ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. రక్తదాతలు ప్రాణదాతలన్న పవన్ స్ఫూర్తితో పంచకర్ల స్వయంగా రక్తదానం చేశారు. తనది ఓ నెగిటివ్ బ్లడ్ గ్రూప్ అని, చాలా అరుదుగా లభించేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎవరికైనా అత్యవసరంగా ఓ-నెగిటివ్ రక్తం కావాలంటే తనను సంప్రదిస్తే రక్తదానం చేస్తానన్నారు. పవన్ కేంద్ర, రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేశారన్నారు. శిబిరంలో మొత్తం 186 మంది రక్తదానం చేశారు. అనంతరం భారీ కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అంతకుముందు పెందుర్తి రైతుబజార్ రైతులను సత్కరించడంతో పాటు వారికి అల్పాహారాన్ని అందజేశారు. అలాగే సీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అయితి సింహాచలం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వేగి దివాకర్, ముదునూరి రాజా సుధాకర్, కరణం దేవుడు సేనాపతి సోమశేఖర్. పిళ్లా జగన్మోహన్‌పాత్రుడు, పిన్నింటి వరలక్ష్మి, జి.సోమునాయుడు, బి.హరగోపాల్, పి.పార్వతి, అధిక సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



70వ వార్డులో పవన్‌కల్యాణ్ పేరిట శివాలయంలో పూజలు చేస్తున్న జనసైనికులు, వీర మహిళలు

గోపాలపట్నం: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని జనసేన నేత బెహరా భాస్కరరావు తమ నివాసంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం స్థానిక ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలను బెహరా పంపిణీ చేశారు. కార్యక్రమంలో 91, 92 వార్డులకు చెందిన జనసైనికులు పాల్గొన్నారు.

ఆటోనగర్: జీవీఎంసీ 70వ వార్డు ఎల్‌వీ నగర్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని జనసేన జెండాను ఆవిష్కరించారు. అనంతరం శివాలయం, అభయాంజనేయస్వామి ఆలయాల్లో పవన్ పేరిట పూజలు చేశారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో జనసైనికులు, వీరమహిళలు లంకల మురళీదేవి, కర్రి శ్రీకాంత్, కేవీ సూరిబాబు, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని పెదమడక సంపత్ వినాయక ఆలయంలో ఆయన పేరిట ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు, కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, కూటమి నాయకులు కర్రి దర్శేంద్ర, గవర సోమశేఖర్, డి.త్రినాథ్, ఎం.వెంకటరమణ, ప్రసాద్, డి.రమేశ్, పెంటారావు, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు. జనసేన 79వ వార్డు అధ్యక్షుడు మేడిశెట్టి విజయ్ ఆధ్వర్యంలోనూ పవన్‌కల్యాణ్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు.



వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల నాగిరెడ్డి, తదితరులు



పెందుర్తిలో వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైసీపీ నాయకుడు దాడి ఉమామహేశ్వరరావు, తదితరులు

వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళి

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని మంగళవారం పలు ప్రాంతాల్లో నిర్వహించారు. ఇందులో భాగంగా 87వ వార్డు కణితి పీహెచ్‌సీ ఆవరణలో వైఎస్ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల నాగిరెడ్డి, తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అందరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. అనంతరం ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు, పేదలకు వస్త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు ప్రగడ వేణుబాబు, ఇల్లపు రాము, తదితరులు పాల్గొన్నారు.

అలాగే 86వ వార్డు పరిధి వుడా నగర్ కూడలిలో వైఎస్ విగ్రహానికి వైసీపీ నాయ కులు చేగొండి శ్రీనివాస్, భూపతిరాజు శ్రీనివాసరాజు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు. 71వ వార్డు శ్రీనగర్‌లో వైఎస్ చిత్రపటానికి వైసీపీ వార్డు అధ్యక్షుడు భూపతిరాజు శ్రీనివాసరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా 87వ వార్డు దుగ్గపువానిపాలెంలో వైఎస్ విగ్రహానికి వైసీపీ నాయకుడు బొడ్డ గోవింద్ పూలమాల వేసి నివాళులర్పించడంతో పాటు పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. నాయకులు ముద్దపు దామోదర్, డి.దానప్పలు, పి.శ్రీను, బి.గోవిందరాజులు, సన్యాసిరావు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన ఘనత మాజీ సీఎం దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డికి దక్కుతుందని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మిందిలో వైఎస్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు గుడివాడ లతీశ్, అప్పలరామ్మూర్తి, ఎస్.నూకరాజు, వెంకటరావు, సురేశ్, హస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: వైసీపీ 85వ వార్డు నాయకుల ఆధ్వర్యంలో మాజీ సీఎం దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కూడలిలో గల వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు జి.పూర్ణానందశర్మ, బలిరెడ్డి నాగేశ్వరరావు, ఎన్.రమణబాబు, చినఅప్పారావు, కె.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: పారిశ్రామిక ఆంతంలోని పలు వార్డుల్లో వైఎస్ వర్ధంతిని నిర్వహించారు. 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, 58వ వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య, వైసీపీ 59వ వార్డు అధ్యక్షుడు రేవల సత్యనారాయణ, 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేశ్, వార్డు అధ్యక్షుడు అంగ వర్మ, వైసీపీ 61వ వార్డు అధ్యక్షుడు పి.రామ్మోహన్‌రెడ్డి (రాము), 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, వైసీపీ 63వ వార్డు అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో రాజశేఖరరెడ్డికి నివాళులర్పించారు.

పెందుర్తి: దివంగత వైఎస్ వర్ధంతిని వైసీపీ రూరల్ జిల్లా మాజీ అధ్యక్షుడు శరగడం చిన అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పెందుర్తిలోని వైఎస్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకుడు గొరపల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు. అలాగే వైసీపీ 96వ వార్డు అధ్యక్షుడు దాడి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పెందుర్తి కూడలిలో గల వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం వృద్ధులకు పండ్లు, రొట్టెలు, అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దొగ్గ గౌతమ్, శరగడం కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు. వైసీపీ 97వ వార్డు అధ్యక్షుడు మెంటి మహేశ్ ఆధ్వర్యంలో సుజాతనగర్‌లో వైఎస్ వర్ధంతిని నిర్వహించారు.



వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటిస్తున్న శరగడం చిన అప్పలనాయుడు, తదితరులు

ఎన్.ఎ.డి.జంక్షన్: ఎన్ఏడీ ఫ్లైవోవర్ వద్దనున్న వైఎస్ విగ్రహానికి మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పూలమాల వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా బడుగు, బలహీన వర్గాలకు వైఎస్ చేసిన సేవలను కొనియడారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు విజయ్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

శ్రమించే కార్యకర్తలకు టీడీపీలో సముచిత స్థానం

» 86వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రమించే కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీలో ఎప్పుడూ సముచిత స్థానం ఉంటుందని 86వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ అన్నారు. వార్డు పరిధిలోని మాతృశ్రీ నగర్‌లో మంగళవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ ఎంతో కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా దువ్వాడ సెక్టర్-1కు చెందిన బలిజ రాధకు ఆపరేషన్ నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.34 వేలు, భరత్ నగర్‌కు చెందిన గొట్టిముక్కల వెంకట కృష్ణంరాజుకు కిడ్నీ మార్పునకు మంజూరైన రూ.2,56,000 చెక్కును అందజేశారు. సమావేశంలో నాయకులు వేగుంట శ్రీనివాస్, ఎం.గణపతి, బి.జగదీశ్, కె.రమేశ్, అప్పారావు, నాయుడు, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.



బాధితుడికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న 'నల్లూరు'

పారిశ్రామికవేత్తలకు అవగాహన సదస్సు

ఆటోనగర్/అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధి పారిశ్రామిక రంగాలపై ఆధారపడి ఉందని ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ అన్నారు. మంగళవారం శీలానగర్‌లో ఎంఎస్ఎంఈ టూల్ రూమ్-సీఐటీడీ-హైదరాబాద్, ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, వరల్డ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో శీలానగర్‌లో నిర్వహించిన వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ రెండు రోజుల అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎంఎస్ఎంఈ ప్రయోజనాల కోసం కొనుగోలుదారులు, అమ్మకందారులకు ఇది చక్కనైన ప్లాట్‌ఫామ్ అన్నారు. దేశంలో అత్యధికంగా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. సీఐటీడీ ప్రతినిధి డాక్టర్ టి.విజయ కృష్ణకాంత్ మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ పాలసీలు, రాయితీలు, వివిధ కంపెనీలు ఇస్తున్న ప్రోత్సాహకాలను ప్రశంసించారు. ప్రోగ్రామ్ ఆర్గనైజర్ వెంకటకృష్ణ ప్రోగ్రామ్ ఆర్గనైజర్ వెంకట కృష్ణ జీఎస్టీ, బీఐఎస్, వీడీపీ, వెండర్ రిజిస్ట్రేషన్, టెండరింగ్ ప్రక్రియ, తదితర అంశాల గురించి వివరించారు. టెక్నికల్ ట్రైనర్ ఎం.వేణుగోపాల్, పారిశ్రామికవేత్తలు ఏకే బాలాజీ, ఈ.కృష్ణ ప్రసాద్, అనార్‌బాబు, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

గోపాలపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైలు కింద తలపెట్టి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సింహాచలం రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం ఉదయం 9.30 గంటల సమయంలో సింహాచలం రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్ శివారు పాత గోపాలపట్నం వద్ద ఓ యువకుడు రైలు పట్టాలపై పరుగు పెడుతూ విజయనగరం నుంచి విశాఖ వైపు వస్తున్న రైలు కింద తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకున్నారు. మృతుని జేబులో లభించిన ఆధార్ కార్డును పరిశీలించగా ఆ వ్యక్తి ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా భేతాని గ్రామానికి చెందిన డిబాకర్ బదత్య (30)గా గుర్తించారు. ఈ మేరకు మృతుడి కుటుంబీకులకు అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు చైన్ స్నాచర్ల అరెస్టు

పెందుర్తి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్కూటీపై వచ్చి ఓ వ్యక్తి మెడలోంచి బంగారు గొలుసును అపహరించిన ఇద్దరు చైన్ స్నాచర్లను పెందుర్తి క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం క్రైమ్ ఎస్ఐ నూరిబాబు తెలిపిన వివరాలలా ఉన్నాయి. స్థానిక రైతు బజార్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న జొమ్మల నాగరాజు గతనెల 22న నైట్ డ్యూటీ ముగించుకుని శారదానగర్‌లోని ఇంటికి బైకుపై వెళుతుండగా ఎదురుగా స్కూటీపై ఇద్దరు వ్యక్తులు అతన్ని అడ్డగించి షైనీ ఉందా అని అడిగారు. లేదని సమాధానం చెప్పేలోగా నాగరాజు మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును తెంచుకుని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీ సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా చైన్ స్నాచర్స్ అయిన ఆరిలోవకు చెందిన కోవెలకొండ సుధాకర్ (22), పెందుర్తికి చెందిన చల్లపల్లి తరుణ్‌ను పట్టుకున్నారు. వీరివద్ద నుంచి సుమారు రూ.2 లక్షల విలువైన బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

ఆర్టీసీ బస్సులో గుండెపోటుతో ప్రయాణికుడి మృతి



మృతి చెందిన రాజేశ్ (ఫైల్)

పెందుర్తి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ ఓ వ్యక్తికి గుండెపోటు రావడంతో మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం వడ్డాదికి చెందిన సయ్యపురెడ్డి రాజేశ్ (42) వ్యవసాయ మార్కెట్ కమిటీలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నారు. మంగళవారం వృత్తి పనుల రీత్యా చోడవరం నుంచి విశాఖకు ఆర్టీసీ బస్సులో వస్తుండగా పెందుర్తి సమీపం రాంపురం వద్ద గుండెపోటు రావడంతో కూర్చున్న సీటులోనే కుప్పకూలారు. దీంతో డ్రైవర్ వాసు, కండక్టర్ మురళీలు సీఆర్పీ చేసి స్థానిక సీహెచ్‌సీలో చేర్పించినప్పటికే మృతి చెందారు. ఈ సమాచారం తెలుసుకున్న సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్టు అధ్యక్షుడు దాడి శ్రీను మృతుడి కుటుంబ సభ్యులను సంప్రదించి నేత్రదానం గురించి వివరించారు. రాజేశ్ కళ్లను దానం చేసేందుకు వారు అంగీకరించడంతో మిగతా ప్రక్రియను పూర్తి చేశారు.

పోలీసుల అదుపులో గోవులను తరలిస్తున్న ముఠా?

గోపాలపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సింహాచలం పరిధిలో అక్రమంగా గోవులను తరలిస్తున్న కొందరు ముఠా సభ్యులను గోపాలపట్నం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. గతనెల 30న సింహాచలంలో నివసిస్తున్న ఎర్రా శ్రీనివాసరావు అనే వ్యక్తికి చెందిన మూడు ఆవులు అదృశ్యమయ్యాయి. ఈ మేరకు బాధితుడు గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సింహాచలం పరిసర ప్రాంతాల్లో అక్రమంగా ఆవులను తరలించే ముఠాపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో సింహాచలం పరిసర ప్రాంతంలో రోడ్లపై సంచరించే ఆవులను రాత్రి వేళలో కొందరు తరలిస్తున్నట్టు గుర్తించారు. ఇలా గోవులను తరలిస్తున్న పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం. కాగా దీనిపై ఎస్ఐ తేజేశ్వరరావును వివరణ కోరగా గోవుల అదృశ్యంపై ఫిర్యాదు అందిందని, దీనిపై దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

నేడు జగదాంబ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ

ఉక్కు పోరాట కమిటీ నాయకులు


ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో ఈవోఐలను నిరసిస్తూ బుధవారం జగదాంబ నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్టు ఉక్కు పోరాట కమిటీ నాయకులు తెలిపారు. అదేవిధంగా ఈవోఐలను తెరవనున్న ఈ నెల 9న ఉక్కు కర్మాగారంలో గంటపాటు అందరూ టూల్ డౌన్ పాటించాలని కోరారు. 12న అన్ని రాజకీయ పార్టీల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని, 16న ప్లాంటులో సమ్మె నిర్వహణ అంశంపై బ్యాలెట్ నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.

స్టీల్ ప్లాంటులో రోడ్డు భద్రతపై కఠిన నిబంధనలు

హద్దుమీరిన ఉద్యోగులకు హెచ్చరిక నోటీసులు ఇస్తున్న అధికారులు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో రోడ్డు భద్రతపై యాజమాన్యం కఠిన నిర్ణయాలను తీసుకుంటుంది. రహదారి నియమ, నిబంధనలను అందరూ తప్పనిసరిగా పాటించేలా చర్యలు చేపడుతున్నారు. కర్మాగారం లోపల వాహనాలు కేవలం 30 కిలోమీటర్ల వేగంతోనే రాకపోకలు సాగించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల వాహనాలు వేగంగా నడుపుతున్న వారికి, హెల్మెట్ లేకుండా ప్రయాణించిన వారికి అధికారులు హెచ్చరిక నోటీసులు జారీ చేశారు. ఉద్యోగుల భద్రత దృష్ట్యా రహదారి నిబంధనలను కఠినంగా అమలు చేయాలని యాజమాన్యం ఆదేశించడంతో ఆ దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. దీంతో ప్రతి ఉద్యోగి పరిమిత వేగంతో, హెల్మెట్ ధరించి మంగళవారం నుంచి విధులకు హాజరవుతున్నారు.

ఘనంగా శంకర్ ఫౌండేషన్ అధినేత జయంతి



శంకరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కృష్ణకుమార్, తదితరులు

వేపగుంట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శంకర్ ఫౌండేషన్ అధినేత, వ్యవస్థాపకుడు ఎ.శంకరరావు జయంతి వేడుకలను నాయుడుతోట సాయిమాధవనగర్‌లోని శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మేనేజింగ్ ట్రస్టీ ఆత్మకూరు కృష్ణకుమార్ మాట్లాడుతూ నిరుపేదలకు సేవ చేయాలనే తపనతోనే ఈ ఆస్పత్రిని శంకరరావు ప్రారంభించారని, ఆయన ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలని ఉద్యోగులను కోరారు. ఆస్పత్రి అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ సీఎస్సార్ నిధులను సమకూర్చుతున్న కార్పొరేట్ ప్రతినిధులు ఎల్‌పీజీ సౌత్ ఏషియా సీఈవో రిచాషిండే, సీనియర్ ఎల్ఐసీ మేనేజర్ శరద్ ప్రసాద్ దాష్, హెచ్ఎస్ఎల్ డైరెక్టర్ రాకేశ్ ప్రసాద్, బ్రాండిక్స్ కంట్రీ హెడ్ ఉదయ్ పెరిరా, గెయిల్ హెచ్ఆర్ హెడ్ మదన్‌మోహన్ లాడే, ఎల్అండ్‌టీ సీఎస్సార్ హెడ్ యుధ్వీందర్‌సింగ్, కనకమహాలక్ష్మి బ్యాంకు చైర్మన్ కె.రాంబాబు, ఎన్‌టీపీసీ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఆస్పత్రి అభివృద్ధికి, ఉచిత శిబిరాల నిర్వహణకు సహకారం అందిస్తున్న కన్వీనర్లు, ఫీల్డ్ స్టాఫ్, ఉద్యోగులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఉత్తరాంధ్రకు చెందిన పలు స్వచ్ఛంద సంస్థల కన్వీనర్లకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. ముందుగా ఆస్పత్రి ఆవరణలో గల శంకరరావు విగ్రహానికి ట్రస్టీలు కృష్ణకుమార్, విజయకుమార్, జీఎం రాధాకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ నశ్రిన్, డాక్టర్ రవీంద్ర, బంగారాజు, రమేశ్‌కుమార్, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

అక్కిరెడ్డిపాలెం/గాజువాక, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటి వద్ద చికిత్స పొందుతున్న తలారి మహర్షికి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఫ్ నుంచి మంజూరైన రూ.4 లక్షల చెక్కును టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అందజేశారు. మంగళవారం గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో ఈ చెక్కును మహర్షి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, అలమండ రాజు, ఎ.శ్రీను, జి.తాతారావు, ప్రకాశ్, ముత్యాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు. అలాగే 85వ వార్డుకు చెందిన పి.నిర్మలకు మంజూరైన రూ.3 లక్షల 30 వేల చెక్కును ఆమె కుటుంబ సభ్యులకు గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అందజేశారు.

నగరంలో ముఖ్యమంత్రి



సమ్మిట్‌లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



నగర పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు స్వాగతం పలుకుతున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు సుందరపు విజయకుమార్, వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణు కుమార్‌రాజు, గణబాబు, పంచకర్ల రమేశ్, బండారు సత్యనారాయణమూర్తి, గంటా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ దాడి వీరభద్రరావు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, తదితరులు



ఈస్ట్ కోస్ట్ మేరీ టైమ్ అండ్ లాజిస్టిక్స్ సమ్మిట్‌కు హాజరైన పారిశ్రామికవేత్తలు



సమ్మిట్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి


ఆంధ్ర వుమెన్ టీ 20 లీగ్ ప్రారంభం

విశాఖపట్నం, స్పోర్ట్సు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ ఆంధ్ర వుమెన్ టీ 20 లీగ్ టోర్నీ మంగళవారం ప్రారంభమైంది. వైజాగ్ చీతాస్, విజయవాడ బ్లాస్టర్స్, రాయలసీమ రాణీస్, తుంగభద్ర దివాస్ జట్లు పాల్గొంటున్నాయి. పీఎం పాలెంలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో మంగళవారం జరిగిన తొలి మ్యాచ్‌లో రాయలసీమ రెయిన్స్ 56 పరుగుల తేడాతో విజయవాడ బ్లాస్టర్స్‌పై గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన రాయలసీమ రెయిన్స్ ఏడు వికెట్లకు 130 పరుగులు చేసింది. అనూష (25), మయస్సార్ అంజుమ్ (25 నాటౌట్), దేవిక (34) రాణించారు. బ్లాస్టర్స్ బౌలర్లలో రిషిక, మేఘన, ధాత్రి తలో రెండు వికెట్లు తీశారు. ఛేదనలో విజయవాడ బ్లాస్టర్స్ తొమ్మిది వికెట్లకు 74 పరుగులు మాత్రమే చేసింది. కెప్టెన్ మేఘన (32) మినహా మిగిలినవారు విఫలమయ్యారు. రాయలసీమ బౌలర్లలో విన్నీ సుజన్ నాలుగు, భార్గవి లక్ష్మి మూడు వికెట్లు పడగొట్టారు.

జంతు ప్రదర్శనశాలకు కొత్త నేస్తాలు

» జంతు మార్పిడి పద్ధతిలో కాన్పూర్ జూ నుంచి రాక

ఆరిలోవ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలకు మంగళవారం కాన్పూర్ జులాజికల్ పార్కు నుంచి జంతు మార్పిడి పద్ధతిలో 25 కొత్త నేస్తాలు వచ్చాయని జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. ఇందులో స్వాంప్‌డీర్‌లు మూడు (ఒక మగ, రెండు ఆడవి) ఆడ స్ట్రైప్డ్ హైనా, కామన్ సౌండ్ బోవా రెండు పిల్లలు, రెడ్‌క్రౌడ్ రూఫ్ టర్టిల్ నాలుగు పిల్లలు, హాగ్ డీర్ ఒక మగది, రెండు ఆడవి, ఖలీజ్ ఫీసెంట్ మూడు మగవి, మూడు ఆడవి, రెడ్ షెల్ డక్ రెండు మగవి, రెండు ఆడవి. రెడ్ పాండ్ బోవా రెండు ఉన్నాయి. ఇక్కడి నుంచి కాన్పూర్ జూకు మొత్తం 23 జంతువులను పంపగా, వాటిలో మూడు అడవికుక్కలు, స్ట్రైప్డ్ హైనా, ఇండియన్ గ్రే ఫూల్స్, లుటీనా పారాకిట్ ఆరు, నక్షత్ర తాబేళ్లు ఆరు, గ్రీన్ ఇగ్వానా నాలుగు, రెండు బార్కింగ్‌డీర్‌లు ఉన్నాయన్నారు. అక్కడి నుంచి వచ్చిన జంతువుల ఆరోగ్యం బాగానే ఉన్నట్టు జూ వైద్యులు ధ్రువీకరించారన్నారు. ప్రొటోకాల్ ప్రకారం వీటిని క్వారంటైన్‌లో ఉంచుతామని, ఆ తరువాత సందర్శకుల దర్శనార్థం సంబంధిత ఎన్‌క్లోజర్‌లలో విడుదల చేస్తామన్నారు. ప్రత్యేక వైద్య బృందం పర్యవేక్షణలో జంతువులను ఉంచామన్నారు.









కామన్ సేండ్ బోవ (ఇసుకలో నున్న పాము)



బాల్ పైథాన్. (ఇంటిలో పెంచుకునే పాము)

అప్పన్న ఆలయంలో పవిత్రోత్సవాలకు శ్రీకారం

» ఈనెల 7వ తేదీ వరకు ఆర్జిత సేవలు రద్దు

సింహాచలం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామి సన్నిధిలో పవిత్రోత్సవాలకు మంగళవారం అంకురార్పణతో శ్రీకారం చుట్టారు. ఏటా భాద్రపద శుక్లపక్ష దశమి నుంచి ఐదు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. ఇందులో భాగంగా సాయంత్రం 6 గంటలకు దర్శనాలు నిలిపివేసిన తరువాత భోగ మండపంలో స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు సారథ్యంలో కరి సీతారామాచార్యులతో కలిసిన వైదికులు పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు, షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం ఈఓ వేంద్ర త్రినాథరావు దంపతులు ఉత్సవ అంగీకారాన్ని తెలిపే విధంగా వైదికులకు నూతనవస్త్రాలు సమర్పించారు. తరువాత సింహగిరి ఈశాన్య దిక్కులోని గంగధార నుంచి మృత్తిక సేకరించి కల్యాణ మండపంలో భూ సూక్తంతో ప్రత్యేక పూజలు చేశారు. స్థానాచార్యులు మృత్తికను శిరస్సున దాల్చి అంతరాలయంలో స్వామివారి సన్నిధిలో ఉంచి పూజలు చేశారు. ఈ మృత్తికను మట్టి పాత్రల్లో వేసి, అందులో నవధాన్యాలు వేయడంతో అంకురార్పణ జరిగింది. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు. కాగా పవిత్రోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో జరిగే నిత్య కల్యాణం, సుప్రభాతసేవ, తదితర ఆర్జిత సేవలను ఈనెల ఏడో తేదీ వరకు రద్దుచేస్తున్నట్టు ఈఓ ప్రకటించారు.



ఆలయ భోగ మండపంలో మృత్తిక పూజ చేస్తున్న వైదికులు

5న అరకులోయకు రానున్న పవన్ కల్యాణ్?

పాడేరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ ఈ నెల 5న అరకులోయ రానున్నారని తెలిసింది. మాడగడ గిరిజనులు గత నెల 25న ప్రారంభించిన 12 రోజుల బలి ఉత్సవంలో పాల్గొనేందుకు వస్తున్నారని సమాచారం. ఈ 'బలి ఉత్సవం'లో అల్లూరి సీతారామరాజు జిల్లాతో పాటు పార్వతీపురం మన్యం జిల్లా, సరిహద్దులోని ఒడిశా రాష్ట్రానికి చెందిన గిరిజనులు పాల్గొంటారు. ఉత్సవం ఆఖరి రోజు కార్యక్రమానికి పవన్ కల్యాణ్ హాజరవుతారని తెలిసింది. అధికారికంగా సమాచారం రాలేదు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నెలాఖరు వరకు పలు రైళ్లకు అదనపు కోచ్‌లు అందుబాటులో ఉంచామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-బ్రహ్మపూర్-విశాఖ, విశాఖ-భువనేశ్వర్-విశాఖ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, విశాఖ-కోరాపుట్-విశాఖ ఇంటర్ సిటీ రైళ్లకు రెండేసి జనరల్ సెకెండ్ సీటింగ్ కోచ్‌లు, విశాఖ-రాయపూర్ పాసింజర్, విశాఖ-కోరాపుట్, విశాఖ-బ్రహ్మపూర్ పాసింజర్ విశాఖ-భవానీపట్న, విశాఖ-గుణుపూర్ రైళ్లకు జనరల్ సెకెండ్ సీటింగ్ కోచ్ జత చేశామన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

» జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి

విశాఖపట్నం, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లాలో సుమారు 11,799 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగుచేసే అవకాశం ఉందని, ఇప్పటి వరకు 10,200 హెక్టార్లలో వివిధ పంటలు వేశారని జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్‌లో పంటల సాగుకు వీలుగా 3,354 టన్నుల ఎరువు అవసరమన్నారు. ఇందులో యూరియా 1,875 టన్నులు, డీఏపీ 690, పొటాష్ 125 టన్నులు, కాంప్లెక్సు ఎరువులు 575 టన్నులు, ఇతర రకాలు 90 టన్నులు వివిధ డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్



సర్టిఫికెట్ అందిస్తున్న రెక్టార్ కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ రాంబాబు

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు క్వాంటం కంప్యూటింగ్‌పై నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ మంగళవారంతో ముగిసింది. హైదరాబాద్, వరంగల్, ధార్వాడ్, కోల్‌కత్తా, భువనేశ్వర్, బెంగళూరు నుంచి క్వాంటం కంప్యూటింగ్‌లో నిపుణులైన 12 మంది రీసోర్స్ పర్సన్లు హాజరై శిక్షణ ఇచ్చారు. ఫ్యాకల్టీ అభివృద్ధి కార్యక్రమంలో మొత్తంగా 114 మంది పాల్గొన్నారు. జాతీయ క్వాంటం మిషన్‌లో భాగంగా నిర్వహించిన ప్రోగ్రామ్ విజయవంతంగా ముగిసిందని కన్వీనర్ ప్రొఫెసర్ కె.వెంకటరావు తెలిపారు. ఇండస్ట్రీ, విశ్వవిద్యాలయాలు, ఇంజనీరింగ్ కాలేజీల అధ్యాపకులు, ప్రొఫెసర్లు, నిపుణులు పాల్గొన్నారన్నారు. ముగింపు సమావేశంలో పాల్గొన్న రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ రాంబాబు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో సహ కన్వీనర్లు డాక్టర్ కె.రాజకుమార్, డాక్టర్ కేవీ రమణ, ప్రొఫెసర్ ఎం.శశి, ప్రొఫెసర్ వల్లీకుమారి, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): క్రెడాయ్ సభ్యులు లేవనెత్తిన సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తామని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ అన్నారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) విశాఖ చాప్టర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన నెలవారీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రెడాయ్ చైర్మన్ వి.ధర్మేంధర్, అధ్యక్షుడు ఇ.అశోక్‌కుమార్, కార్యదర్శి వి.శ్రీను పలు అంశాలను ప్రస్తావించారు. ఆర్టీఎస్ చట్టం కింద దాఖలైన దరఖాస్తులను 15 రోజుల్లో పూర్తిచేయాలని, ప్రతి దరఖాస్తుకు టౌన్ సర్వేయర్ ఒకే రిమార్కును కోసం అంగీకరించాలని కోరారు. ప్రామాణిక డాక్యుమెంటేషన్‌తో వేగవంతంగా ఆమోదించాలన్నారు. ఆస్తి పన్ను అంచనా, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్, నీటి, యూజీడీ కనెక్షన్లు, మాస్టర్ ప్లాన్ 2041 కింద రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్స్ వేగవంతమై బదిలీ చేయగల అభివృద్ధి హక్కులపై సరళమైన విధానాలు ఉండాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన కమిషనర్ ఆర్టీఎస్ దరఖాస్తులను రెండు రోజుల్లో క్లియర్ చేయగల సాఫ్ట్‌వేర్ ఆధారిత వ్యవస్థను ప్రవేశపెడుతున్నామన్నారు. డాష్ బోర్డు ద్వారా సమయానుకూల సమాచారం అందుతుందన్నారు. వ్యవస్థ పూర్తిగా కాంటాక్ట్‌లెస్‌గా ఉండటంతో మధ్యవర్తుల అవసరం ఉండదన్నారు. ఆర్‌డీపీల ఆమోదాల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. అన్ని ప్రణాళికలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి పారదర్శకతను తీసుకొస్తామని హామీ ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

క్రైం... crime news

భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి కింద పడి ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన సమతా కలాశాల సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఎంవీపీ సమతా కళాశాల సమీపంలో కర్లాన్ ఆర్‌ఎన్‌సీ ప్రాజెక్ట్ ఓ భవనం నిర్మిస్తోంది. ఇక్కడ బిహార్ నుంచి వచ్చిన కార్మికులు పనిచేస్తున్నారు. కొందరు అక్కడే నివాసం ఏర్పాటుచేసుకున్నారు. సోమవారం తెల్లవారుజామున త్రిపురారి మంజీ (49) విధుల్లో భాగంగా భవనం పైకి వెళ్లి, అక్కడి సామగ్రి పరిశీలించిదిగుతుండగా, మొదటి అంతస్తు నుంచి కిందకు పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని సైట్ ఇంజనీర్లు కేజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. నిర్మాణ సంస్థ ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చీటింగ్ కేసులో ఇద్దరు ముద్దాయిలకు జైలు శిక్ష

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని అధికారులను మోసం చేసి సంస్థకు నష్టం కలిగించిన కేసులో ఇద్దరు ముద్దాయిలకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పిందని స్టీల్‌ప్లాంట్ సీఐ ఈ.కేశవరావు తెలిపారు. 2019 సెప్టెంబరు 7న సంస్థలో పిగ్‌ఐరన్ లోడ్ కోసం అగనంపూడికి చెందిన లక్కరాజు శివాజీ, పలక వెంకినాయుడు లారీలో ప్లాంట్‌కు వచ్చారు. ఈ సమయంలో లారీలో సుమారు నాలుగు టన్నుల బరువున్న సిమెంట్ స్లర్రీ మెటీరియల్‌తో ప్రవేశించి కాటా వేసి తరువాత దానిని బయట వేసి, అదే బరువు పిగ్ ఐరన్ లోడ్ చేసుకున్నారు. ఈ విషయం గమనించిన అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్రమంగా లోడ్ చేసిన పిగ్ ఐరన్ ఖరీదు రూ.1,38620గా లెక్కించారు. కోర్టులో నేరం రుజువు కావడంతో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కమ్ ఎనిమిదో అదనపు చీఫ్ మెట్రో పాలిటిన్ మేసిస్ట్రేట్ శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

ఈఎంఐ కార్డులతో మోసం చేస్తున్న యువకుడి అరెస్టు

ఎండాడ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బజాజ్ ఫైనాన్స్ ఈఎంఐ కార్డులను లక్ష్యంగా చేసుకుని ఎలక్ట్రానిక్ వస్తువులు కొనుగోలు చేసి, వాటిని ఓఎల్‌ఎక్స్‌లో అమ్ముతూ డబ్బులు కొల్లగొడుతున్న యువకుడ్ని సైబర్ క్రైం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన మంచాల మధు నాగసాయి (26) డిగ్రీ చేసి, 2023లో ఉపాధి నిమిత్తం విశాఖ వచ్చాడు. మర్రిపాలెంలో ఉంటూ ట్రావెల్స్ కారు, బైక్‌ల అద్దె వ్యాపారం చేసేవాడు. 2024లో క్రెడిట్ కార్డు ద్వారా రూ.5 వేలు మోసపోయాడు. దీంతో కొత్త ఆలోచనకు తెరలేపాడు. బజాజ్ ఈఎంఐ కార్డు ఇస్తే దాని ద్వారా క్యాష్ చేస్తా, 10 శాతం కమీషన్ చార్జ్ చేస్తా అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో నకిలీ అకౌంట్ ఓపెన్ చేశాడు. ఐడీలు చూసి ఈఎంఐ కార్డులతో అమెజాన్‌తో పాటు ఇతర షోరూంలలో ఏసీలు, ఫ్రిజ్‌లు, మొబైల్స్, వాషింగ్‌మెషీన్లు వాటిని వెంటనే తక్కువ ధరకు ఓఎల్‌ఎక్స్ డైరెక్ట్ షోరూంలో అమ్మేసి వచ్చిన డబ్బులో 10 శాతం కమీషన్ తీసుకుని మిగతా అమౌంట్ కస్టమర్‌కి ఇస్తానని నమ్మించి మోసం చేశాడు. విజయనగరానికి చెందిన కనకల రాహుల్ రూ.48,073, హైదరాబాద్‌కు చెందిన పోలిశెట్టి రవి రూ.47,098, తెలంగాణ రాష్ట్రానికి చెందిన చురుకుపల్లి వెంకటరమణ రూ 47,098, సముద్రాల సుధాకర్ రూ. 59,098, మహారాష్ట్రకి చెందిన లాడే హేమాంశు రూ.26,098, ఢిల్లీకి చెందిన విశాంత్‌లాల్ రూ.31,097, ఏపీకి చెందిన గాస్పెల్ రాజు నుంచి రూ 27,097 ఇలా మొత్తం రూ 2,85,659 వసూలు చేశారు. ఏడాదిలో సుమారు 60 మందిని మోసం చేసినట్టు సైబర్ క్రైం పోలీసులు గుర్తించారు. ఈ మేరకు నాగసాయిని రుషికొండ కూడలిలో ఉన్న వేవ్ అండ్ డైన్ రెస్టారెంట్ దగ్గర సెల్ టవర్ లొకేషన్ ఆధారంగా గుర్తించి అరెస్టు చేశారు.

దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు

సీతంపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తల్లి తన కుమారుడిని మందలిస్తుండగా మధ్యలో కలుగచేసుకొన్న వ్యక్తి ఇనుప రాడ్డుతో బాలుడి తలపై కొట్టాడు. ఈ మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రామకృష్ణనగర్‌లో నివసిస్తున్న వినయ్ (16) ఐటీఐ చదువుతున్నాడు. కొద్ది రోజులుగా వినాయకపందిరి వద్ద తీన్‌మార్ కొడుతున్నాడు. దీంతో పవన్ తల్లి మందలించింది. ఈ నేపథ్యంలో అక్కడే ఉన్న విఘ్నేశ్వర రావు ఆమెతో గొడవకు దిగడంతో పవన్ అడ్డుకున్నాడు. కోపంతో విఘ్నేశ్వర రావు ఇనుప రాడ్డుతో వినయ్ తలపై కొట్టాడు. ఫిర్యాదు మేరకు గాయపరిచిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని సీఐ ఉమాకాంత్ కేసు నమోదు చేశారు.

రైల్వేస్టేషన్‌లో 50 కేజీల గంజాయి పట్టివేత

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైల్లో తరలిస్తున్న 50 కేజీల గంజాయితో పాటు నలుగురు నిందితులను ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకున్నారు. ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన గౌరవ్ మిశ్రా (30), ఒడిశాకు చెందిన శశంక ప్రధాన్ (21), రజా భారీక్ (22), మహ్మద్ ఫైజాబ్ (24) మంగళవారం గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచామని రైల్వే పోలీసులు తెలిపారు.

కాపర్ ప్లేట్ల చోరీ కేసులో పురోగతి

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగంలో జరిగిన కాపర్ ప్లేట్‌ల చోరి కేసు పురోగతి సాధించినట్టు తెలిసింది. బీఎఫ్ స్టోర్స్‌లో భద్రపరిచిన ఆరు కాపర్ ప్లేట్‌లు కనిపించలేదని, అధికారులు గత నెల 28న పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నలుగురు అనుమానితులను ప్రశ్నించినట్టు సమాచారం. ఆరు ప్లేట్‌లకు గాను రెండు ప్లాంట్‌లోని ఆర్‌ఎంహెచ్‌పీ విభాగం వద్ద గల పొదల్లో ఉన్నట్టు గుర్తించారు. మిగిలిన వాటిపై విచారణ చేస్తున్నారు. చోరికి గురైన స్టోర్స్ తాళం వేసి ఉన్నప్పటికీ చోరీ ఎలా జరిగిందనేది అంతుబట్టడం లేదు. కాపర్ ప్లేట్ ఒకోకకటి సుమారు టన్నుకు పైగా బరువుంటుంది. వాటిని ఎలా తరలించారో అంతుబట్టడం లేదు. ఈ కేసులో ప్లాంట్‌లోని ఓ కార్మిక నాయకుడి పాత్ర ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సముద్ర అధ్యయన కేంద్రం పరిశీలన



భవన నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

సాగర్‌నగర్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): సాగర్‌నగర్ సమీపంలోని బీపార్కు కొండ దిగువన బీచ్ రోడ్డుకు ఆనుకుని రూ. 30 కోట్లతో నిర్మిస్తున్న నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ భవనాన్ని కేంద్ర బృందం మంగళవా రం పరిశీలించింది. ఈ సందర్భంగా బృంద సభ్యులు మాట్లాడుతూ ఈఏడాది ఆఖరికి భవన నిర్మాణం పూర్తవుతుందన్నారు. కొండవాలు మలుపుల వద్ద బలమైన రక్షణ గోడలు నిర్మించాలని అధికారులకు సూచించారు. భవనంలో ఓషన్ ఫిజిక్స్, సముద్ర అధ్యయనం, పర్యావరణం, ఖనిజ అన్వేషణ, పారిశ్రా మిక రీసెర్చ్, తదితర అధ్యయనాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. దేశ వ్యాప్తంగా 38 భవనాలు నిర్మిస్తుండగా అందులో విశాఖ ఒకటి అని చెప్పారు.

ఉక్కులో ఈనెల భారీగా ఉద్యోగ విరమణలు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఈ నెలలో భారీగా ఉద్యోగ విరమణలు జరగనున్నాయి. సాధారణ విరమణలు 49, 464మంది ఉద్యోగులు వీఆర్‌ఎస్ ద్వారా వెళ్తున్నారు. గతంలో తొలి వీఆర్‌ఎస్ ద్వారా 1,164 మంది, సాధారణ ఉద్యోగులు 192 మంది రిటైరయ్యారు.

4న ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

కంచరపాలెం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయం సమీపంలో గల నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్ వద్ద ఈనెల 4న నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఉపాధి కల్పనాధికారులు పేర్కొన్నారు. ఈ మేళాలో ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నారు .పది, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ తదితర అర్హతలు కలిగిన నిరుద్యోగులు హాజరుకావాలన్నారు. అభ్యర్థులు ముందుగా తమ వివరాలు, అర్హతలను నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఆసక్తి, అర్హత గల నిరుద్యోగులు ఈనెల 4వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు అన్ని ధ్రువపత్రాలతో హాజరుకావాలని ఉపాధి కల్పనాధికారులు సూచించారు.